# తంబి వెలుగు

కుటుంబ ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక

సంపుటి : 17 సెప్టెంబరు - అక్టోబరు 2011 సంచిక : 5





తంబూరతో... తంతివాయిధ్యములతో పిల్లన గ్రోవ్రులతోను ఆయనను స్తుతించుడి (కీర్తన 150:4)
Salim Shaik,
B.Com.,
(S) 6610223 (R) 2560199,
Cell : 9392113553.
www. taalmusicals.com
తాళ్
మ్యూజికల్ ప్యాలెస్
& ఇన్స్టిట్యూట్
డోర్ నెం. 26-9-29, యెర్నేని మేన్షన్,
గాంధీనగర్,విజయవాడ - 3
అన్నిరకముల సంగీత వాయిద్యములు లభించును మరియు సంగీతం నేర్పబడును
If undelivered please return
the Editor
THAMBY VELUGU
Joseph Thamby Ashram PEDAVUTAPALLI- 521 286,
Krishna Dist., A.P., India. Ph : 08676-259248
Mother Print House Gunadala, Cell 9848726197

సంపాదకీయం

# ఆనంద సోపానాలు - అష్టభాగ్యాలు

ప్రియమైన "తంబివెలుగు" పాఠక మహాశయులకు క్రీస్తునందు శుభములు ఆకాంక్షించుచున్నాను. దేవుడు మిమ్ము సదా కాచి కాపాడుదురుగాక! తన ముఖ లావణ్యమును మీపై ప్రసరింపచేసి మిమ్ము తన వెలుగుతో నింపుదురు గాక!

***"దేవుడు మానవజాతిని సృజించెను. తనను పోలినట్లు మానవుని చేసెను. స్త్రీ పురుషులనుగా మానవుని సృజించెను"*** అని పరిశుద్ధ గ్రంథము పలుకుచున్నది (అ.కా. 1:27). మరియు ***"దేవుడైన యావే నేలమట్టి కొంత తీసుకొని దాని నుండి మానవుని చేసెను. అతని ముక్కు రంధ్రములలో ప్రాణవాయువు నూదెను. మానవుడు జీవము గల వాడయ్యెను"*** (ఆ.కా. 2:7) అనియు బైబిలు గ్రంథము బోధించుచున్నది.

దేవుని పోలికలో మనిషి ఊపిరి పోసుకున్నాడు. అందుకే అతనికి "వ్యక్తి" హోదా లభించింది. అందువల్ల అతడు పదార్థం కాదు. అతడు ఒక వ్యక్తి. ఆత్మజ్ఞానం, ఆత్మాధీనం గల వ్యక్తి అతడు. స్వయానా దేవుని జీవంలోనే పాలు పంచుకోవడానికి అర్హత, ఆహ్వానం పొందిన ఏకైక దైవ సృష్టి మానవుడు మాత్రమే. మరి భగవంతుడు ఎందుకు మనిషిని యింతటి మహోన్నతమయిన స్థితిలో చేశాడు? మానవ సృష్టి వెనుక వున్న పరమ రహస్యము ఏమిటి? మానవ సృష్టికి గల ఉద్దేశమునుగురించి తిరుసభ ఏమని బోధిస్తుంది?

***"దేవుడు తనను తెలిసికొని, ప్రేమించి, సేవించి, అటువెనుక మోక్షముపొందుటకు మానవుని సృష్టించెను"*** అని సత్యోపదేశ తరగతులలో ఒకప్పుడు నేర్చుకున్నాము కదా! ఆ పాత "సత్యోపదేశ సంక్షిప్తము" పుస్తక ప్రతులు ఇప్పటికిని వాడుకలో వున్నాయి. కాని ఒక విషయం గుర్తుంచుకోవాలి. అదేమనగా "అటువెనుక మోక్షం పొందుటకు" అనగానే మన ఇహలోక జీవితం ముగిసిన తరువాత అని, లేదా మన మరణానంతరము అని అర్థం వస్తుంది. కాని దేవుడు మనలను సృష్టించినది కేవలం మన మరణాంతరము మోక్షం పొందుటకే కాదు. దేవుడు అనుక్షణం మన ఆనందాన్ని, సంతోషాన్ని కోరుకుంటాడు. అనగా, మనం ఇహమందును, పరమందును కూడా సంతోషముగా వుండుటకు, ఎల్లప్పుడును మోక్షానంద భాగ్యములో జీవించుటకును ఆయన మనలను సృజించెను. ఈ విషయమునే "కతోలిక శ్రీసభ సత్యోపదేశం" (Catechism of the Catholic Church) అను పేరుతో 1992లో ప్రచురింపబడి 2005 సంవత్సరములో తెలుగులో అనువదింపబడిన ఈ బృహత్ గ్రంథం తెలియపరుస్తుంది. సత్యోపదేశములోని 1721వ పేరా ఇలా చెబుతుంది : ***"దేవున్ని తెలిసికొని, ప్రేమించి, సేవించటము ద్వారా మోక్షం చేరడానికి మనల్ని ఆయన ఈ లోకంలో ఉంచాడు."*** మోక్షానంద భాగ్యం మనల్ని దైవ స్వభావంలోను, నిత్య జీవంలోను భాగస్తులను చేస్తుందని, ఈ భాగ్యంతోనే మనిషి క్రీస్తు మహిమలోనికి, త్రిత్వైక దేవుని జీవన ఆనందంలోనికి ప్రవేశిస్తాడు అని కూడా సత్యోపదేశం బోధిస్తుంది.

మత్తయి 5:3-10 ఈ మోక్షానంద భాగ్యమును పొందు విధానాన్ని బోధిస్తుంది. వీటినే మనం అష్టభాగ్యాలు అని పిలుస్తుంటాము. ఇవి యేసు క్రీస్తు ప్రబోధాలకు గుండెలాంటివి. వాటిని

*నాణానికి రెండువైపులు ఉన్నట్లే ప్రతివాడికి మరో వైపు వుంటుంది.*

ఒక్కసారి మననం చేసుకుందాం :

*"దీనాత్ములు ధన్యులు - దేవరాజ్యం వారిది.*
*శోకార్తులు ధన్యులు - వారు ఓదార్పబడుదురు.*
*వినమ్రులు ధన్యులు - వారు భూమికి వారసులగుదురు.*
*నీతినిమిత్తము ఆకలి దప్పులు గలవారు ధన్యులు - వారు సంతృప్తి పరపబడుదురు.*
*దయామయులు ధన్యులు - వారు దయను పొందుదురు.*
*నిర్మల హృదయులు ధన్యులు - వారు దేవుని దర్శింతురు.*
*శాంతి స్థాపకులు ధన్యులు - వారు దేవుని కుమారులనబడుదురు.*
*ధర్మార్థము హింసితులు ధన్యులు - దేవరాజ్యము వారిది.*

దేవునికి ఇష్టమయిన బిడ్డలుగా జీవించుటకు, పైన తెలియపరచబడిన జీవన్మార్గ సూత్రములను పాటించి నపుడల్లను మనం సంతోషముగా జీవించగలము. ఎందుకనగా, ఆనందం పట్ల ఉన్న స్వాభావిక మైన కోర్కెను ఈ అష్టభాగ్యాలు తీరుస్తాయి. ఆ కోర్కెకు మూలం దేవుడే. ***"మనిషిని తనవైపు ఆకర్షించు కోవడానికి దేవుడే ఆ కోరికను మన హృదయంలో పుట్టించాడు. ఆ కోరికను దేవుడు మాత్రమే తీర్చగలడు"*** అని సత్యోపదేశం బోధిస్తుంది (క.శ్రీ.స. 1718). పునీత అగస్తీను గారు ఈ విధంగా పలుకుచున్నారు "మనమంతా సంతోషముగా జీవించాలని కోరుకుంటాం. ఈ ప్రతిపాదనను స్పష్టముగా చేయకముందే దీన్ని అంగీకరించని వాళ్లు మానవ జాతిలో ఏ ఒక్కరూ వుండరు." వారు ఇంకొంచెం ముందుకు వెళ్ళి యిలా అంటున్నారు "ప్రభూ! నేను నిన్ను ఎలా వెదుకుతున్నాను? నిన్ను వెదుకు తున్నందు వల్లనే దేవా నేను ఆనందమయ జీవనాన్ని వెదుక్కుంటున్నాను. నా ఆత్మ జీవించడానికి నిన్ను వెదకనీ, ఎందుకంటే నా దేహం నా ఆత్మనుండి, ఆ ఆత్మ నీనుండి జీవాన్ని పొందుతాయి." మన కోరికలను దేవుడు మాత్రమే తృప్తి పరుస్తాడని పునీత తోమాసు అక్వినాసు వారు సెలవిచ్చియున్నారు.

దేవుని కొరకు జీవించుట ద్వారా, మనలో జీవిస్తూ వుండి మనలను జీవింపజేయుచున్న దేవుని ఆత్మ ప్రబోధాలకు, సూచనలకు, ప్రేరేపణలకు అనుగుణంగా జీవించుట వలన మనం పొందే ఆనందం లోకాతీతం, అనంతం, అమూల్యం, అద్భుతం, అది దేవుని కృపావరం. ఇటువంటి ఆనందం, పరమానందం, జీవితంలో మనం తీసుకునే ప్రతి నైతిక పరమయిన నిర్ణయాన్ని వెంబడిస్తూ వస్తుంది. అనగా ఉత్తమ నైతిక విలువలతో పూర్ణమైన నిర్ణయాలు తీసుకుని వాటిని ఆచరణలో పెట్టినపుడెల్ల మానవుడు సంతోషాన్ని, ఆనందాన్ని పొందుతాడు.అలాంటి ఆనందములో జీవించుటయే మోక్షభాగ్యం. అది మన హృదయాలను చెడు ప్రవృత్తుల నుండి శుద్ధి చేసుకోమని సకల వస్తువుల కంటే సర్వేశ్వరుని అధికంగా ప్రేమించమని, నిన్ను వలె నీ పొరుగు వారిని గూడా ప్రేమించమని ఆహ్వానిస్తుంది. అసలు సిసలైన ఆనందం ఐశ్వర్యములో గాని, ఉన్నత స్థితిలో గాని, మానవ ప్రఖ్యాతిలో గాని, అధికారంలో గాని, మానవుడు సాధించిన ఘన విజయాల్లో కాని అవి ఎంత ఉపయోగకరమైనా సరే ఉదా: విజ్ఞానశాస్త్రం, సాంకేతిక శాస్త్రం, కళాశాస్త్రం, లేక ఏ సృష్టి జీవిలోను అది లభ్యంకాదు. మంచి అంతటిని ప్రేమ యంతటికి మూలమైన దేవునిలో మాత్రమే నిజమయిన దైవశక్తి, సంపూర్ణమైన ఆనందం మనకు లభిస్తుంది (క.శ్రీ.స.1723). అటువంటి ఆనందం మీ కందిరికీ ప్రాప్తించాలని మనసారా ప్రార్థిస్తూ..... దీవెనలతో....

– **ఫా. దేవదాసు** OFM Cap



# జపమాల అద్భుత శక్తి

**అక్టోబరు 7వ తారీకు**

**అమ్మా! జపమాల రాజ్ఞీ! అందుకో మా వందనాలు.**

*– Sr. ఫాతిమమేరి CSA, ఖమ్మం*



ఈ విశ్వప్రపంచములో వత్సరములు, కాలాలు, ఋతువులు, మాసాలు మారినా, ఆది-అంత్యము, ఆల్ఫా - ఒమేగా, మొదటివాడు - కడపటివాడు, యావే దేవుడు మారని దేవుడు. నిన్న, నేడు, రేపు ఏకరీతిగా, మానవుల రక్షకుడుగా, సృష్టికర్తగా వున్న ప్రేమామయుడు యేసు. *యేసుకు జన్మనిచ్చిన తల్లి మరియ. ఆమె స్త్రీలందరిలో ధన్యురాలు. దేవుని తల్లిగా యావే దేవుడు ఆమెను ఎన్నుకున్నారు.* ఆ కన్యమరియ తల్లియే సకాలంలో ఆపదల్లో దర్శనమిచ్చి, బిడ్డలను ఆదుకున్నారు. పుణ్యక్షేత్రములు వేలకొలది మరియ తల్లి పేరట వెలిసినవి.

క్రీ.శ.1571 సం॥రము అక్టోబరు మాసంలో ఐరోపా ఖండములోని క్రైస్తవులకు, మహమ్మదీయులకు లెపాంతో వద్ద యుద్ధము ప్రారంభమైనది. ఎంతో భయంతో కొద్దిమంది సిలువ సైనికులు (క్రూసేడుల) యుద్ధమునకు క్రూసేడుల వెళ్ళారు. కాని 5వ భక్తినాథ పోపుగారు సైనికులందరిని మెడలో జపమాలను ధరించుకొని యుద్ధానికి వెళ్ళమని ఆదేశించారు. పోపుగారు మోకరించి, ప్రతిదినము జపమాల రాజ్ఞి సహాయం కోరుచు జపమాలను జపించారు. మరియతల్లి సహాయంతో మన సైనికులు యుద్ధములో గెలిచారు. శత్రువులు పారిపోయినారు. పోపుగారు అక్టోబరు 7వ తారీఖున జపమాలమాత పండుగను కొనియాడాలని ఏర్పాటు చేశారు. అన్ని మేత్రాసనములలో, అన్ని గ్రామములలో, ప్రతి క్రైస్తవుడు దివ్యసత్ప్రసాదం ఎదుట భక్తితో, అక్టోబరు మాసము అంతా తల్లి దీవెనలు పొంద జపమాలను జపించాలని విశ్వలేఖ ద్వారా ప్రపంచానికి ఆదేశించారు. సద్గుణాల సుందరి, అనుగ్రహాల పరిపూర్ణురాలు మరియతల్లిని గౌరవించి జపమాల ధ్యానం చేస్తూ, క్రీస్తు ప్రభువు పుట్టుక, బాధలు, శ్రమలు మహిమలు అద్భుతాలు ధ్యానించుచు, భక్తితో ప్రార్థించేదే జపమాల. విశ్వకతోలిక సంఘము, మరియతల్లిని కొనియాడుతుంది. శ్రీసభలోని కతోలికులందరు చిన్నతనము నుండలు కూడ 53 పూసలు క్రీస్తు ప్రభువు చరిత్ర ధ్యానించుచు, ఒక పరలోక జపము -10 మంగళవార్త జపములు 5 గురుతులు ధ్యానించి జపిస్తే, మన కుటుంబాలను, సంస్థలను, దేశమును ప్రభువు దీవించును. అద్భుతశక్తిగల ఏకైక ముక్తి సాధనము

జపమాల.

ఓ ప్రియసోదరా! ఓ ప్రియసోదరీ! నేడే మేలుకో! మరియతల్లి పాదాల చెంత చేరి అనుదినం జపమాల ప్రార్థనలతో భక్తితో ప్రణమిల్లుదాము. జపమాల ఒక భక్తిరస ధ్యానప్రార్థనయని చెప్పాలి. కోట్లాది భక్తులు జపమాలను జపించి, భక్తులుగా, పునీతులుగా జీవించారు. అమ్మ పట్ల అపారమైన భక్తిని పెంచుకున్నారు. పునీతులందరు అమ్మను గౌరవించుచు, ఉత్థాన యేసు ప్రభువుతో వుండాలి, పరిశుద్ధులు, పరిశుద్ధులు అని నిత్యము ఆరాధించు చున్నారు. పునీత బెర్నార్డుగారు ఒక్కొక్క మంగళవార్త జపము జపించి, మనుష్యుల నుండాలి దయ్యాలను పారద్రోలినారు. ఆ తల్లిని ఆశ్రయించి, ప్రార్థించిన వారలు, ఒక్కరును వదలిపెట్టబడలేదు. మిక్కిలి నెనరుగల తల్లీ, మీ శరణమునకు పరుగెత్తుకొని వచ్చెదు.... అనే జపమును భక్తితో ప్రార్థించితే ఆ తల్లి నీకు నాకు అనేక అద్భుతాలు జరిగించును. విశ్వాసముతో జపమాలను జపిస్తే ఆ తల్లి ఘోరమైన విపత్తుల నుండాలి, వ్యాధిబాధలనుండాలి మనలను తప్పకుండ ఆదుకొని కాపాడును. కొన్నిసార్లు మనకు మనమే ప్రతిదినము జపమాలను ఎందుకు జపించాలి?మరియమాత జపమాలను జపించమని అడిగినారా? అని ప్రశ్నించుకొంటుంటాము. ఆ తల్లి జపమాలను జపించాలని కోరినారు. కొన్ని ఉదాహరణలు చూద్దాం:

క్రీ.శ.1858 సం॥రముతో ఐరోపా ఖండములోని ఫ్రాన్సు దేశములోని లూర్ధునగరములో ఆ తల్లి బెర్నదెత్త అనే బాలికకు దర్శనమిచ్చారు. జన్మపాపరహితోద్భవినని చెప్పి, పాపాత్ముల మనసుల మార్చుటకు ప్రతిదినము జపమాల జపించమని ఆదేశించి, 14 దర్శనాలు ఇచ్చి దీవెనలతో దీవించారు. 1917 సం॥రములో పోర్చుగల్ దేశములోని ఫాతిమా గ్రామములో ఫాతిమమాతగా, లూసి, ఫ్రాంచీస్, జెసింత అను ముగ్గురు పిల్లలకు దర్శనమిచ్చారు. ఉపవాసము, తపసు, దాన, ధర్మాలతో (1) ప్రపంచశాంతి కొరకు మొదటి ప్రపంచ యుద్ధం ఆగిపోవాలనియు (2) పాపాత్ముల మనసుల మార్చుకొనుటకును, (3) కుటుంబాలలో శాంతి సమాధానముల కొరకు తాను జపమాల రాజ్ఞియని, ప్రతిరోజు జపమాలను జపించమని, ఆ తల్లి కోరింది. ప్రతి గురుతు తదుపరి, "ఓ నా యేసువా! నా పాపములు క్షమించండాలి..." అనే ప్రార్థనను ఫాతిమామాత నేర్పించినారు.

ప్రియ సోదరులారా.... సుమారు 60 మంది పాపుగార్లు మరియమాత భక్తులుగా, జపమాలను జపించారు. జపమాల ప్రతి గ్రామములో కుటుంబాలతో, విచారణలో జరిపించాలని వారి విశ్వలేఖల ద్వారా ప్రోత్సహించారు.

(1) జపమాలను జపించండాలి. సర్వకోరికలు సాధించండాలి. జపమాలను మన మెడలో, మన చేతులలో ధరించి, ప్రార్థించే బిడ్డలను చూచి, సాతాను వణికి పారిపోవును అన్నారు ధన్య మదర్ తెరేసా గారు.

(2) పునీత డాన్‌బోస్కో గారు ప్రతి ఆపదలో, కష్టములలో సమస్యలలో తల్లి చెంత చేరి అమ్మా! నన్ను,




యువతీ యువకులను ఆదరించమని అమ్మకు ప్రీతికరమైన ప్రార్ధన, జపమాలను జపించారు. అద్భుత విధముగా కోరికలన్ని విని దీవించింది ఆ పరమతల్లి.

(3) పునీత లూయిస్ డి మోంటు పోర్టుగారు, అమ్మ నేర్పిన జపమాలను 30 మంది, 80 మంది, 100 మందితో కలిసి జపిస్తే ఒకేసారి 1/2 గంటలో అది జపమాల ఫలితమును పొందే గొప్ప ప్రార్ధనని జపమాల భక్తులను ప్రోత్సహించారు.

(4) ధన్య రెండవ జాన్ పాల్ పోపుగారు, "నాకు ఎన్ని పనులున్నా అత్యంత ప్రీతికరమైన ప్రార్ధన - దివ్యసత్ప్రసాద ప్రభువు సన్నిధిలో ప్రతి దినము 203 పూసల 4 జపమాలలు, విశ్వవ్యాప్తి సజీవ జపమాలను జపించకుండ నిద్రించను" అన్నారు.

(5) ప్రపంచములో లక్షలాది కుటుంబాలలో కొన్ని కుటుంబాలు మాత్రమే రాత్రిలో కుటుంబము అంతా కలిసి, విచారణలోని భక్తులతో కలిసి, జపమాలను జపించుచున్నారు. మరియతల్లి, ఫాతిమానగర్, లూర్ధునగర్‌లోను, పునీత బెర్నార్డు గారికి, పునీత దోమినీకు గారికి దర్శనమిచ్చి 15 వాగ్దానములు దీవెనలు పంచిన అద్భుత కరమైన శక్తి వంతమైన ప్రార్ధన జపమాల.

ఓ ప్రియ సహోదరులారా! నేడు టి.వి. ప్రపంచములో పడి, సినిమాలు, సీరియల్‌లు గంటలు కొలది చూస్తూ చాలామంది కాలంగడుపుచున్నారు. కంప్యూటరుల యుగంలో శరవేగంతో రోజులు గడచిపోతున్నవి. దోపిడీలు, హత్యలు, అన్యాయాలు, కక్షలు ఎపుడు ఏమి జరుగునోయని, జీవితంలో క్షణక్షణం భయాందోళనతో జీవిస్తున్నాము. నేడే మేలుకో! భక్తులందరు సంతోష, వెలుగు, దుఃఖ, మహిమ రహస్యాలు ధ్యానించుచు, జపించు భక్తిరసమాల...జపమాల. పిశాచులను గడగడ వణికించి, పాపద్రోహుల బలమైన మాల.. జపమాల. ఉత్తరించు స్థలాల్లోని ఆత్మలను త్వరలో మోక్షములో చేర్చుమాల...జపమాల. అమ్మ పాదాల చెంతచేరి అడిగిన కోరికలన్నీ తీర్చి, భక్తుని ఆదరించుమాల... జపమాల. అమ్మగా ఆలించి, తల్లిగా పాలించి, బిడ్డలకోసం ప్రార్థించుమాల.... జపమాల. పాపులకోసం ప్రణమిల్లి, తన కుమారుని చెంతకు చేర్చు మనందరి జననీమాల.... జపమాల. ప్రపంచశాంతికై, పాపుల హృదయ పరివర్తనకై జపించమని కోరిన జన్మపాపరహితోద్భవిమాత మాల.... జపమాల. అభాగ్యులందరికి, యువతీ యువకులకు అందించిన అనుదిన ఆహారమాల.... జపమాల. మనలను పాపకూపమునుండి రక్షించి, ప్రేమతో స్వర్గంలోనికి చేర్చేమాల.... జపమాల. ఈలోక జీవితంలో పుణ్యజీవితంను ప్రసాదించి, మరియమాత బిడ్డలుగా నడిపించి, మరణ సమయంలో దేవుని వరాలు సమృద్ధిగా నింపుమాల.... జపమాల. మరియతల్లి భక్తులకు మూడు రోజులు ముందు మరణమును తెలిపి, స్వర్గమునకు చేర్చే ఏకైక భక్తిమార్గం జపమాల. జీవితంలో సువార్తీకులందరి కొరకు, అన్యుల కొరకు, గురువుల కొరకు, కుటుంబాల కొరకు, రోగులందరికి ఆరోగ్యమును ప్రసాదించమని, యేసు చెంత చేరి మరియతల్లిని ప్రార్థించి ఆశీసులు, దీవెనలు పొందుదాము.

(సమాప్తం)

*ప్రపంచంలో రెండే మహాశక్తులు -కత్తి, కలం. రెండవది మొదటి దానికంటే గొప్పది -నెపోలియన్*

# క్రీస్తులోనే నా రక్షణ

- ఫా.ఎన్.జ్వాన్నేస్



ప్రతిమనిషి తను పెరిగిన సాంఘిక, సాంస్కృతిక, కుటుంబ పరిస్థితులనుబట్టి తన ఆలోచనా విధానం, ప్రవర్తన ఉంటుంది. కాని మనిషి తన కృషితో మార్పు చెందే అవకాశము ఉంది, అది దేవుడు ఇచ్చినవరం. ఉదాహరణకు ఒక బాలుడు చిన్నా భిన్నం అయిన కుటుంబ పరిస్థితులలో తల్లిదండ్రుల మధ్యా సఖ్యత లేకపోవడం, ఒకరినొకరు అర్థం చేసుకోలేకపోవడం, ప్రతీక్షణం గొడవలు, మనస్పర్థలు ఉన్నటువంటి కుటుంబములో పెరుగుతూ ఉంటే ఆ బాలుడు పెరిగి పెద్దయిన తరువాత తన మానసిక పరిస్థితి ఎలాఉంటుందో మనం ఉహించగలం.

ఈనాటి ఆధునిక వ్యవస్థలో కుటుంబపరిస్థితులు చాలా అధ్వాన స్థితిలో ఉన్నాయి. కలిసిజీవిస్తున్నా "ఎవరికి వారే, యమునా తీరే" అన్నట్లుగా జీవిస్తున్నారు. ప్రేమలో లోపించడం, అర్థం చేసుకునే మనసత్వం లేకపోవడం, అధిక సంపాదన మీద అత్యధిక ధ్యాస కలిగి ఉండడం మనం చూస్తూ ఉన్నాము. ఇది చాలావరకు వాస్తవం. ఈ పరిస్థితి కుటుంబములో మాత్రమే కాదు, సంఘములో కూడా చూస్తూ ఉన్నాము. వీటన్నిటికి కారణం ఒక భయంకరమయిన నిజం అది ఏమనగా, దేవుని మీద విశ్వాసం లోపించడం మరియు దేవుడంటే అసలు నమ్మకం లేకపోవడం, అశాశ్వతమైన స్వశక్తి, మానవశక్తి మీద నమ్మకము ఎక్కువై శాశ్వతము, ఆదియు, అంత్యము అయిన దైవశక్తి మీద నమ్మకము, విశ్వాసము కోల్పోతున్నారు. రంగురంగులతో, అందచందాలతో ఆకర్షనీయంగా కనిపిస్తూ ఆధ్యాత్మికంగా బలహీనముగా ఉన్నవారిని ఆకర్షిస్తు, క్షణబంగురమయిన ఈ లోక చిన్న చిన్న ఆనందాలతో జీవిస్తూ శాశ్వత నిత్యజీవిత, పరలోక భాగ్యమును దూరము చేస్తూ ఉంది ఈ లోకం.

"రాబోవు కాలములలో కొందరు ఈ విశ్వాసమును విడనాడుదురు అని పవిత్రాత్మ స్పష్టపరచినది. అసత్యములాడు ఆత్మలకు విధేయులై, సైతాను బోధనలను వారాచరింతురు" (తిమోతి 4:1) అని పునీత పౌలుగారు చెప్పిన మాటలు అక్షరాలా నెరవేరుచున్నాయి.

అప్పుడప్పుడు కొందరు అనుభవజ్ఞులు, ఇలా పలుకడం వింటూ ఉంటాం: "మా కాలంలో ఉన్న

అనుబంధాలు, ఆప్యాయతలు, కట్టుబాట్లు ఈనాటి సంఘవ్యవస్థలో కనిపించడంలేదు. అందరూ కూసి కూర్చోని ఒకే కుటుంబంలాగ ఆనందముతో కబుర్లు చెప్పుకొని ఎన్నాళ్ళయిందో." ఇది చాలా వరకు వాస్తవం. ఎడారి ప్రాంతానికి వెళ్ళి అడుగు అడుక్కి బావి తవ్వినా ఒక్కచుక్కైనా నీరు దొరకదు. శాశ్వత ఆనందంకోసం, అశాశ్వతమైన లోకం వెంబడూ పరుగూలు తీస్తూ ఉన్నాం. బాగా సంపాదించి కుటుంబాన్ని అంటే భార్యను, పిల్లలను సంతోషపెట్టాలని, కుటుంబంతో గడపడానికి కొంతసమయం కూడా వెచ్చించలేని అధ్వానస్థితిలో ఉన్నారు ఎందుకుంటే గొప్ప ఆర్థికస్తోమత వలన ఆనందం వస్తుందని అనుకుంటూ ఉండే అసత్యపు ఆలోచన వలన.

(నిర్గమ 32:4) "... దానిని చూచి ప్రజలు ఉత్సాహముతో యిస్రాయేలూ! నిన్ను ఐగుప్తు నుండి నడిపించుకొని వచ్చిన దేవరయితడే అని అరచిరి." ఆవిధంగా యిస్రాయేలీ ప్రజలు విలువైన బంగారములో వారిని నడిపించిన దేవుడు ఉన్నాడని సంపదకు దేవునికి ముడిగట్టారు. సజీవుడు ఆకారములేని, అన్నింటా, అన్నివేళలా ఉండగలిగే దేవుని బంగారములో బంధించాలని చూశారు. ఆకారము లేని దేవునికి ఆకారం ఇవ్వ ప్రయత్నించారు. ఇది అంతా సాతాను ప్రేరణం అని గ్రహించలేకపోయారు.

ఆ యిస్రాయేలు ప్రజలకు, విజ్ఞానంతో, పరిజ్ఞానం సంపాదించి, సత్యాన్ని, అసత్యాన్ని తెలుసుకొనగలిగే విచక్షణాజ్ఞానం అభివృద్ధిపరచుకొని, అభివృద్ధిపథంలో నడుస్తున్న ఈనాటి మనిషికి ఏమాత్రం తేడా కనిపించడలేదు.

### పరలోక రాజ్యపు అనుభవం.

అంతములేని ఆధ్యాత్మిక, మానసిక ఆనందం, సంతోషం అనుభవించగలిగే పరిస్థితే పరలోక రాజ్యము అని ఎంతో మంది మహనుభావులు తెలియపరచారు. "పరలోక రాజ్యము మీలోనే ఉన్నది." మనము ఎప్పుడైతే సృష్టికర్తను మనసృష్టికి మూలకారణం అని అంగీకరిస్తామో, మనలను ప్రతినిత్యం నడిపిస్తున్నారని విశ్వసిస్తామో, ఆ విశ్వాసాన్ని మనలో అభివృద్ధి పరుస్తూ ప్రేమలో జీవించడానికి ప్రేరేపిస్తున్నారని నమ్ముతామో అప్పుడు పరలోక రాజ్య బీజం నాటుకుంటుంది. ఈ విశ్వాసము ద్వారానే మనము ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందగలుగుదుము. అప్పటి వరకు నేను, నాది, నా కుటుంబం, నా సంపాదన అని ఆలోచించినవాడు, మనము, మనందరం అనే భావన ఏర్పడుతుంది. అప్పుడు గర్వము వినయమునకు దారినిస్తుంది. కష్టాలు, బాధలు, సంతోషం, ఆనందగా కనిపిస్తాయి. లోకం మొత్తం ఒక వింత అనుభూతిగా మారుతుంది అప్పటి వరకు గమనించని ఎన్నో విషయాలు కళ్ళకు కట్టినట్లు కనిపిస్తాయి. అవివేకముతో కూడిన పరుగూలు విజ్ఞాన వంతమయిన నడకను సూచిస్తాయి. అందరూ పరాయి వాళ్ళు, పగవాళ్ళు అనుకున్న మనసూ అందరిని క్రీస్తు నందు రక్తసంబంధీకులుగా అంగీకరిస్తుంది. ఇటువంటి అనుభూతే పరలోక రాజ్యపు అనుభూతి.

పునీత పౌలుగారు తనకోసం జీవిస్తున్నప్పుడు తను దేవుని కాపాడుతున్నాను అనుకున్నాడు. అంటే దేవుని కోసం పాతనిబంధన చట్టాలను విశ్వాసము నిలబెట్టడం కోసం తను పోరాడుతున్నాడు అనుకున్నారు. కానీ మారుమనసు పొందిన తరువాత స్వయాన దేవుడే మనుష్యావతారమెత్తి తనకోసం క్రీస్తువిలువైన రక్తాన్ని చిందించారని తెలుసుకొని పశ్చాత్తాపపడ్డారు.

మనకు నిజమైన దైవానుభూతి కలిగించేటి ఆనందం కోసం, పరలోక రాజ్య ఆనందం కోసం ఈ లోకంలో వెదుకుతున్నాము. ఈలోక పోకడలకు లోనవుతున్నాము. ఈ లోకంలో అనుభవించే స్వల్ప ఆనందములే శాశ్వతమనే భ్రమలో జీవిస్తున్నాము. కాని ఇప్పటికయినా క్రీస్తును మనహృదయంలోకి ఆహ్వానించి శాశ్వత ఆనందాన్ని పొందుదాము. పునిత పౌలుగారు చెప్పినట్లు "ఇహముందు ధనవంతులైనవారు గర్విష్ఠులుగా ఉండక, అస్థిరములగు ధనమందు నమ్మకముంచక, మనము సంతోషముగా అనుభవించుటకు ధారాళముగా కావలసినదంతయు దయచేయు దేవుని యందే నమ్మకముంచవలెనని బుద్ధిచెప్పుము" 1తిమోతి 6:7

దేవుని యందు నమ్మకముంచుదాము. ఎటువంటి జీవన పరిస్థితులలో ఉన్నా, పేదరికము, మానసిక వేదన, ఇహలోక సంపదను చూసుకొని గర్వముతో విర్రవీగుతూ ఆధ్యాత్మిక అంధకారములో ఉన్నా దేవుడు మనకు ఆధారం. ఆయన లేకుండా అన్ని ఉన్నా శూన్యం. ఆయన మనలో ఉంటే ఏమి లేకున్నా అంతామనదే.

వింత ప్రపంచములో విలువైన జీవితం
జులజులపారేనది, రివ్వున వీచేగాలి
ఎటువైపో వాటి పయనం, ప్రయాణం?
ఎవరి కోసమో కోయిల మధుర గానం
మయూరి శోయగాల నాట్యం
అందమైన విచిత్ర ప్రపంచం
సృష్టి రహస్యపు లోలోతులలో
ఎటు చూసినా ఆశ్చర్యం, అద్భుతం
కాని మనిషి జీవితమనుగడ
రోజురోజుకు అధ్వానం అయోమయం
ఆత్మీయ జీవిత విలువలకు వ్యవహారాల
ప్రవాహాలలో ప్రవహిస్తూ
నరకాగ్ని వైపుకు కొట్టుకుపోతున్న వాస్తవం.
క్రీస్తుతోనే మన రక్షణ, స్వర్గరాజ్యపు అదృష్టం.

# సహనం

- బ్ర.పాలుదుగు జోసఫ్

*"మనకు సంపూర్ణత, సమగ్రతను సాధించిపెట్టేది 'సహనం' అనే సద్గుణమే"*

- పునీత అసీసీపుర ఫ్రాన్సీస్

ఒక వ్యక్తి ఒకరోజు సహనం అనే సద్గుణాన్ని ప్రసాదించమని ప్రభువుని ప్రార్థించాడు. ఒకరోజు ఆ వ్యక్తి పొరుగూరు వెళ్ళాలి అని స్టేషన్‌కి వెళ్లేసరికి బస్సు వెళ్లిపోయింది. చాలా నిరాశ పడ్డాడు. తనను తాను ద్వేషించుకున్నాడు. తరువాత బస్సు ఒక గంటన్నర తరువాతే ఉందన్నారు. అసహనంతో అటు ఇటు తిరగాడు. ఆ స్టేషన్‌లో ఎవరితోను మాట్లాడకుండా తిరగాడు పలుకరించినా మాట్లాడ కుండ కాలాన్ని గడుపాడు. ఒక గంట తరువాత అలసిపోయి ఒక బెంచి మీద కుర్చొని కళ్ళు మూసుకున్నాడు అప్పుడు గుర్తుకు వచ్చింది సహనాన్ని ఇవ్వమని దేవునికి ప్రార్థించిన విషయం. అప్పుడు ఆ వ్యక్తి గుర్తించాడు, దేవుడు నాకు సహనం వహించ డానికి తగిన అవకాశాన్ని కలుగ జేశారు. అయినా నేను దాన్ని గ్రహించలేదు అని అప్పుడు బాధపడ్డాడు ఎందుకు ఆ సమయాన్ని వ్యర్థం చేసుకున్నాను అని.

మానవునికి సహనం చాలా అవసరం. సహనం లేని వారికి నిలకడ ఉండదు. ఓర్పులేని వారికి శాంతి లభించదు. కొందరు నిందలు, అవమానాలు ఓర్చుకోలేరు. మాటకు మాట, దెబ్బకు దెబ్బ వేస్తేనే వారికి తృప్తిగా వుంటుంది. ప్రతి స్వంత విషయంలో గూడ ఇతరుల గుర్తింపు కొరకై మెప్పుకొరకై ఎదురు చూస్తుంటారు. అది వారికి అందకపోతే బాధపడుతుంటారు. అందుకే పవిత్రాత్మ అనుగ్రహ శక్తి వల్ల దేవుని బిడ్డలు అధికంగా ఫలించగలరు. ఆత్మఫలాలను పొంద గలరు. ఆత్మఫలాలు ఏమనగా, "ప్రేమ, ఆనందం, శాంతి, సహనం, దయ, మంచితనం, విశ్వస నీయత, సాధుశీలం, సంయమనం" (గలతి 5:22) ఆత్మద్వారా మనం జీవిస్తాం. మనల్ని మనం పరిత్య జించుకొనే కొద్ది ఆత్మ ఆదేశించినట్లు నడుస్తాం.

దేవుడు మానవులందరికి న్యాయాధిపతి యైనప్పటికి జాలి గుండె కలవాడు : "ప్రభువు నీతిమంతుడు అందరిని నీతితోనే పరిపాలించును" (జ్ఞాన గ్రంథము 12:15).

ప్రభువు పాపాన్ని ఖండిస్తాడు కాని పాపిని కనికరిస్తాడు. దేవుని యందు ఆత్మ విశ్వాసంతో జీవించువారు నిందలు, అవమానాలు, తప్పిదాలు వచ్చినను ఓర్పుతో సహనం కలిగి జీవిస్తారు. దేవునిపట్ల సహనాన్ని వ్యక్తపరచి మనం గూడ అట్లే మన తోటివారి యెడల దయ, తాలిమి కలిగి వుండాలి. దేవుడు పాపిని వెంటనే శిక్షించువాడు కాదు కాని పాపాత్ముని హృదయ పరివర్తనకోసం ఎదురు చూస్తారు. ఎప్పుడైతే మానవుడు హృదయ పరివర్తన చెందుతాడో అప్పుడు తప్పిపోయిన కుమా రుని వలే దగ్గరకు స్వీకరిస్తాడు.

కొన్నిసార్లు మంచిపై చెడుదే పైచేయిలా కనిపిస్తుంటుంది ఎందుకని? దుష్టులు ఎందుకు అభివృద్ధి చెందు తారు, చెందబడుతున్నారు? దుష్టుల యొక్క అభివృద్ధి తాత్కాలికమైనది, కాని ఓర్పు సహనంతో జీవించే ప్రతి ఒక్కరికి ప్రతిఫలం శాశ్వతమైనది. డా.హార్‌వార్డ్ హెడ్రుంకేల అనుభవ పరిశోధనలు ద్వారా తెలిసిన విషయం: ప్రతి విచారణలో 16% ప్రజలు ఎప్పుడూ మారరు. భయంకరమైన విషయం ఏమిటంటే యువకులైన గురువులు 16% శాతాన్ని చూసి చాలా నిరాశతో నిండలు ఉన్నారు. వారు ఏమి చేయాలంటే మిగిలిన 84% పై శ్రద్ధ తీసుకోవాలి. అప్పుడు విచారణలో మంచిగా ప్రార్థనా జీవితం సాగుతుంది. బిషప్ శన్ గారు యిలా అంటున్నారు : "క్రైస్తవ అధికారులు ఇంకా కొంచెం కరుణ, జాలి దయ చూపించి ఉన్నట్లయితే హిట్లర్, ముసోలినిని బడి నుండి స్టాలిన్ సెమినరి నుండి పంపకపోతే ఈ కుళ్ళు మొక్కలు చరిత్రలో మంచిగా ఉండేవారేమో?"

మనం క్రైస్తవులం అందరం చెడును గుర్తించ డానికి, దానిని వేరుచేయడానికి పిలువ బడ్డాము. మనం ఎక్కువగా ప్రార్థించి మనలను మనం జాగ్రత్త చేసుకోవాలి. దేవుడు మన నుండి కోరేది చెడుకు బదులుగా మంచి, శాపానికి బదులుగా ఆశీర్వాదం, విమర్శకి బదులుగా పొగడ్త, ద్వేషానికి బదులుగా ప్రేమ, ప్రతీకారానికి బదులుగా క్షమించడం, అబద్ధా నికి బదులుగా నిజం. మున్నగు మంచిలక్షణాలను గలిగి జీవించాలి అని.

మన సమాజంలో సత్పురుషులు, దుష్టులు వున్నారు మంచి వారిని చెడ్డవారిని వేరుచేయడం కష్టం. కొందరు చెడ్డవారు మంచివారిగా కనిపించవచ్చు. ప్రతివ్యక్తిలో మంచి, చెడు గుణాలు వుంటాయి. అందుకనే తొందరపడి తీర్మానం చెయ్యకూడదు. తీర్పు అనేది చివరి గడియల్లో రావాలి. ఏదో ఒక తప్పు ద్వారా జీవితంలో తీర్పు చేసి శిక్షించకూడదు. లేదా బహు మానాన్ని అందజేయకూడదు. ఒకరు ఈరోజు ఒక చెడు కార్యం చేయవచ్చు. మరొకడు ఇప్పుడు మంచి వాడిగా ప్రవర్తించి రేపు దుష్టునిగా తయారు గావచ్చు. కాబట్టి దేవుని అనుగుణంగా పరిశుద్ధ జీవితం జీవించాలి.

సువార్తలో మనం చదివినట్టుగా యూదా - యేసును అప్పగించాడు పేతురు తనను తిరస్కరిం చినవాడు తోమాసుగారు క్రీస్తు ఉత్థానం అయిన తరువాత ప్రభువును చూసే అంతవరకు ప్రభువును నమ్మలేదు యోహాను, యాకోబులు సొంత కోరికలకు ప్రాధాన్యత, ఇచ్చినవారు. అయినా యేసు వారందరిని ప్రేమించాడు, క్షమించాడు. చివరకు యూదా ఒక్కడు మాత్రం తన ప్రాణాన్ని తనకు తానే తీసుకున్నాడు. ఒక దుష్టునిగా మారాడు. మనలో ఉన్న చెడును తొలగించడానికి ఓపికతో దేవుని శక్తి మీద ఆధారపడాలి.

క్లార్ రహనర్ అనే వేదాంత పండితుడు యిలా ఉపదేశిస్తున్నారు : "ప్రపంచంలో నాస్థికతకు కారణం క్రైస్తవ లేనట. ఒకవైపు దేవున్ని ప్రకటిస్తారు. అదే నోటితో చెప్పిన మాటను జీవితంలో ఆచరిం చరు. అందుకని ఇంకా చెప్పడం మాని ఆయన మనకు చెప్పినట్లు చేయడం మంచిది. అప్పుడు సువార్తకు అంతవిలువ, శక్తి, ఆకర్షణీయత ఉంటుంది."

(సశేషం)



# దేవుడు మనతో ఉన్నచో మనము వర్ధిల్లుతాము

– శ్రీమతి జెసింతారాణి, హైదరాబాద్

## దేవుడు మనతో ఉండవలయుననిన మనము చేయవలసిన పనులు

***1. దేవునికి ప్రీతికరమైన పనులను చేయాలి (యోహా 8:29) :-***

యేసు దేవాలయములో బోధిస్తూ యూదులతో ఈ విధంగా పలుకుతాడు. “నన్ను పంపినవాడు నాతో వున్నాడు. నేను ఎప్పుడును ఆయనకు ప్రీతి కరమగు పనులనే చేయుచున్నాను. కనుక, ఆయన నన్ను ఏకాకిగా విడిచి పెట్టలేదు.” దేవునికి ప్రీతికరమైన పనులను చేసినపుడు ఆయన ఎల్లప్పుడు మనతోనే ఉంటాడు.

ప్రియులారా! దేవుడు మన నుండి కోరునదంతయు బైబిలు గ్రంథములో లిఖించబడినది. కనుక దానిని చదివి పాటించినచో దేవుడు మనతో ఉండి మనకు జయమునిస్తాడు.

***2. దేవుని మాటకు లోబడియుండవలెను (నిర్గ 7:6) :-***

ప్రియులారా! దేవుడు మనతో వాక్యము ద్వారా, ప్రవక్తల ద్వారా లేదా అంతరాత్మతో మాట్లాడినపుడు మనము ఆయన మాటకు లోబడవలెను. మనలను సరిదిద్దినపుడు, ఆ దిద్దుబాటునకు మనము లొంగవలెను. అపుడే దేవుడు మనతో ఉంటాడు.



*దేవుని మాటకు లోబడని సౌలురాజునకు ఏమౌతుందో చూద్దామా (1సమూ 15:23)*

దేవుడు సౌలును ఇశ్రాయేలు దేశపు మొదటి రాజుగా అభిషేకిస్తాడు. ఈ సౌలు బెన్యామీను గోత్రమునకు చెందిన కీషు అనువాని కుమారుడు. తండ్రి గాడిదలు తప్పిపోయినపుడు వానిని వెదకుచూ సమూయేలు ప్రవక్త దగ్గరకు పోతాడు. అపుడు దేవుడు సమూయేలు ప్రవక్తద్వారా సౌలును రాజుగా అభిషేకిస్తాడు. రాజుగా అభిషేకించబడిన తరువాత సౌలు గర్వముతో దేవుని మాటను దిక్కరించి రాజరికము కోల్పోతాడు.

ఒకమారు దేవుడు సమూయేలు ప్రవక్త ద్వారా సౌలుతో మాట్లాడుతాడు: “ఇశ్రాయేలీయులు ఐగుప్తునుండి వెడలి వచ్చునపుడు అమాలేకీయులు

వారినెదిరించి బాధించిరి. కనుక నేను వారిని శిక్షింపవలెను. కావున నీవు పోయి వారిని వధించి శాపము పాలు చేయుము. వారిలో ఒక్కరిని గూడ బ్రతుకనీయవద్దు. స్త్రీలను, పురుషులను, పిల్లలను, పశువులను అన్నింటిని మట్టుపెట్టుము. యిది యావే ఆజ్ఞ" (1సమూ 15:1-3). సౌలు యుద్ధమందు అమాలేకీయులను సంహరిస్తాడు. కాని వారి రాజైన అగాసను ప్రాణముతో వదలివేస్తాడు. పనికిరాని జంతువులను చంపి, పోతరించిన యెద్దలను, గొర్రెలను తనతో పాటు తెచ్చుకుంటారు. (1సమూ 15:9)

వెంటనే దేవుడు సమూవేలు ప్రవక్తతో "సౌలును రాజును చేసినందులకు విచారిస్తాను. అతడు నన్ను లెక్క చేయక నా ఆజ్ఞను దిక్కరించెను" అని పలుకుతాడు (1సమూ 15:10). ఆ మాటలకు సమూవేలు చాలా నొచ్చుకుంటాడు. మరునాడు సమూవేలు సౌలును కలుసుకొని "నీవెంత అల్పుడవైనను యావే నిన్ను యిస్రాయేలు గోత్రములకు నాయకునిగా నియమింపలేదా? యిస్రాయేలీయులకు రాజుగా అభిషేకించలేదా? యావే నీకొక పనిని అప్పగించెను. అమాలేకీయులను, వారి పశువులను వధింపుమనెను. మరి యావే ఆజ్ఞను దిక్కరించి, దోపిడుల సొమ్ము దక్కించుకొని, యావే యెదుట ఏల పాపము చేసితివి?" అని అడుగగా సౌలు, "నేను మేలి యెద్దలను గొర్రెలను మిగుల్చుకొనిన మాట నిజమే. కాని నీ దేవుడైన యావేకు బలి అర్పించుటకే వానిని అంటి పెట్టుకొంటిని" అని చెప్పుతాడు (1సమూ 10-21).

అందులకు సమూవేలు "బలుల వలన యావే సంతృప్తి చెందునా? విధేయత వలన గాదా? బలి అర్పించుట కంటే విధేయత మేలు. తిరుగుబాటు సోదె. చెప్పించుకొనుట వంటిది. గర్వము విగ్రహములను పూజించుట వంటిది. నీవు యావే మాట త్రోసి వేసితివి కనుక యావే నీ రాచరికమును త్రోసివేసెను" అని పలికెను (1సమూ 15:23-23).

చూశారా ప్రియులారా! సౌలు దేవుని మాటకు లోబడనందులకు దేవుడు అతనిని రాజపదవి నుండి తొలగిస్తారు. సమూవేలు ప్రవక్త అభిషేకించినపుడు పొందిన ఆత్మ యిపుడు సౌలును వదలివెళ్లిపోతుంది (1సమూ 16:14). ఫలితంగా సౌలు ఫిలిస్తీయ యుద్ధంలో దుర్మరణము చెందుతాడు (1సమూ 31:6). తరువాత దావీదు యిస్రాయేలు రాజవుతాడు. దేవుని మాటకు లొంగి జీవిస్తాడు. కనుకనే 40 యేండ్లు యిస్రాయేలీయులను పాలిస్తాడు. దేవుడు మనకు అధికారమిచ్చినప్పుడు ఆయన చిత్తము ప్రకారము చేయాలి కాని సౌలు లాగా మన చిత్త ప్రకారము చేయకూడదు.

(సశేషం)



# దృఢమైన విశ్వాసం

- జి.హృదయమేరి, గుణదల



“నీ విశ్వాసం నిన్ను రక్షించింది.” అన్న మాటలు జ్ఞాపకం వస్తే, నా విశ్వాసం చాలా తక్కువ. ఇది ఎలా ఉంటుందంటే ఒక తాడుపై ఒక కాలితో నడుస్తూ, ఎపుడు పడిపోయి చనిపోతానా అన్న భయం ఏర్పడుతుంది. అలాగే విశ్వాసం లేకపోతే ఎపుడు ఏది వచ్చినా గాలికి కొట్టుకొనిపోయే దుమ్ములాగ ఉండకూడదు. గాలి వీచినపుడు ఆకులు మాత్రమే ఎగిరి పోతాయి. కాని బలమైన గాలి వీచినపుడు దుమ్ముకూడ లేచి పోతుంది. అలాగే పెద్ద సమస్య వచ్చినపుడు విశ్వాసం కోల్పోయి అనుమానములకు గురౌతూ ఉండకూడదు. విశ్వాసం బలంగా ఉండాలంటే ఆ దేవాది దేవుణ్ణి సంపూర్ణ హృదయంతో తగ్గింపు జీవితంతో కృతజ్ఞతా భావంతో ప్రార్థించాలి.

మన సమస్యలు ఎవరితోనో చెప్పి సంతోషపడదాం అనుకుంటే సినిమాలు చూసి సంతోషాన్ని కొనుక్కుందాం అనుకొంటాం. తప్పతాగి మైమరచి పోయి మన సమస్యల్ని మర్చిపోదాం అనుకుంటాం. ఇవన్నీ భ్రమ ఒకరిని చూచి మరొకరు అనుసరిస్తూ ఉంటారు. అదేవిధంగా మంచివాళ్లను అనుసరించడమంటే ఇష్టం ఉండదు. ఎందుకంటే వాళ్ళని అనుసరించేదేంటి నాది నాకు తెలియదా! అని వాళ్లపై అసూయ, స్వార్థాన్ని వెదజల్లుతాం. దీనితో ఇక్కడ రెండు తప్పులు అయ్యాయి. ఇలా విశ్వాసం లేక మన తప్పులు మనం పెంచుకోవడం తప్ప వేరేది లేదు. విశ్వాసం లేకపోతే దానిని మనం అనుకోకుండా క్రియల ద్వారా కూడా చూపిస్తూ ఉంటాం. ఒక పనిని మొదలుపెట్టే ముందు అది మంచిదా? చెడ్డదా? ఉపయోగమా! కాదా? అని ఆలోచించి చేయాలి. మరీ ముఖ్యంగా అది జరుగుతుంది, జరగాలి అనేది విశ్వసించాలి. అంతేగాని పని మొదలు పెట్టిన దగ్గర్నుంచి ఆ...ఇది జరుగుతుందంటారా! అని అనుమానించకూడదు.

“త్రోసి వేసిన రాయి తలకు మూల రాయి అయింది” అనే వాక్యం చూస్తే నాకు విశ్వాసం ఉంది, ఉంది అని అనుకుంటూ మనం దానిని కోల్పోతే, తిరిగి ఈ సమయంలో విశ్వాసంలో ప్రతిక్షణం మెలకువగా ఉండాలి మనం, మనంగా ఉంటూ, విశ్వాసంలో దృఢంగా, బలంగా ఉంటూ ఇతరులకు సుమాతృకగా ఉండుటకు ప్రయత్నించాలి. అదే మనం సాధించాల్సింది.

# లవ్ డాట్ కామ్ (Love.Com)

- బ్ర. జోసఫ్ మాదాను

ఓ సారి ఒక సన్యాసి ఓ నది ఒడ్డున నడుస్తూ వెళ్తున్నాడు. అంతలోనే హఠాత్తుగా ఓ తేలు నీటిలో పడి ప్రాణం కోసం కొట్టుమిట్టాడుతుంది. అది గమనించిన ఆ సన్యాసి హృదయం ద్రవించింది. ఎలాగైనా ఆ తేలును రక్షించాలని నిర్ణయించు కున్నాడు. తన రెండు చేతులతో నీటిలోని తేలుని తీయబోయాడు. అంతే! వెంటనే ఆ తేలు అతన్ని కుట్టింది, “అమ్మా!”అని తన రెండు చేతులు దులిపాడు. వెంటనే ఆ తేలు నీటిలో పడింది. తేలుపై తనకున్న ప్రేమతో దాన్ని రక్షించడానికి మళ్లీ యత్నించాడు. మళ్లీ ఆ తేలు అతన్ని కుట్టింది. బాధగా ఉన్నా సరే తాను మాత్రం తన ప్రయత్నాన్ని ఆపలేదు. మరోసారి ప్రయత్నించాడు. అయినా ఏమి లాభం? మళ్ళీ అదే చేదు అనుభవం.

దేవుని యందు ప్రియులారా! ఈ కథ మనకు ఎంతో వింతగా అనిపించవచ్చు. కాని ఈ కథలోని గూఢార్థాన్ని మనం అర్థం చేసుకోవాలి. తేలు స్వభావం ఏమిటో మనందరికీ తెలుసు. దాని స్వభావం కుట్టడం. కాని, ఆ సన్యాసి స్వభావం ప్రేమించడం, రక్షించడం. మనరక్షణ చరిత్రలో కూడా జరిగింది ఇదే. యావే ప్రభు మానవాళిని ఎంతో ప్రేమిస్తూ వచ్చాడు. కాని, మానవులు మాత్రం ఆ ప్రేమను తిరస్కరించారు. అయినా దేవుడు మాత్రం మానవాళిని ప్రేమించడం మానాడా? లేనేలేదు. తన ప్రేమను చాటి చెప్పడానికి ఎన్నో విధాలుగా ప్రయత్నించాడు. మానవులు క్రూరులు కాబట్టి, దేవుని ప్రేమను తిరస్కరించడం మాత్రమే కాకుండా, తాను పంపిన ప్రవక్తల పట్ల, దేవుని కుమారుడైన యేసుక్రీస్తు పట్ల కూడా క్రూరంగా ప్రవర్తించారు. ప్రేమ రాజ్యాన్ని స్థాపించడానికై వచ్చిన ప్రేమామయుని ప్రేమను తిరస్కరించడం మాత్రమే కాకుండా, భారమైన సిలువను మోయించి, అదే సిలువపై కిరాతకంగా చంపారు. ఎంత ఘోరం? ఇంత చేసినా సరే యేసు క్రీస్తు మానవాళిని శపించాడా? లేదు. మనల్ని అనుక్షణం ప్రేమించాడు, ప్రేమిస్తున్నాడు.

ప్రస్తుతం మనం అత్యాధునిక సమాజంలో వ్యవహరిస్తున్నాం. కంప్యూటర్ యుగంలో విహరిస్తున్నాం. కంప్యూటర్ ద్వారా ఎన్నో విషయాలను నేర్చుకుంటున్నాం. కంప్యూటర్ ద్వారానే ఎన్నో కార్యాలను కంట్రోల్ చేస్తున్నాం. కంప్యూటర్ ద్వారానే కొంతమంది ప్రేమ ఫలించడం కూడా

మనం చూస్తున్నాం. కంప్యూటర్ యుగంలో జీవిస్తూ మనం కూడా ప్రభువుతో ప్రేమలో పడదామా? అందుకు మనం చేయాల్సింది ఒక్కటే. డబ్ల్యు డబ్ల్యు డబ్ల్యు. మత్తయి 22:37,39.కామ్ (www.Mt22:37,39.com) క్లిక్ చేద్దాం. అప్పుడు ప్రభువే మనతో స్వయంగా ఇలా మాట్లాడుతారు. "నీ దేవుడైన ప్రభువును నీవు పూర్ణ హృదయముతోనూ, పూర్ణ ఆత్మతోను, పూర్ణ మనసుతోను ప్రేమింప వలెను". "నిన్ను నీవు ప్రేమించుకొనునట్లు, నీ పొరుగువానిని ప్రేమింపవలెను" (మత్తయి 22:37,39). ఇదే లవ్ డాట్ కామ్ (Love.com) యొక్క రహస్యం.

"మాలిన్యం మనసులో ఉన్నా, మల్లెపూవులా నవ్వగలగడం ఈనాటి తెలివి" అని తిలక్ అంటారు. అలాంటి స్వభావాన్ని విడిచిపెట్టి, మన తోటి వారితో సఖ్యపడి జీవిద్దాం. మన విమర్శలకు అడ్డుకట్ట వేద్దాం. ఎందుకంటే "మనుష్యులను విమర్శిస్తూ పోతే వారిని ప్రేమించడానికి మనకు సమయం దొరకదు" అని ధన్య మదర్ థెరిసా గారు అంటారు. తంబివెలుగు పాఠకులకు, శ్రేయోభిలాషులకు లవ్ డాట్ కామ్ (Love.com) వెబ్‌సైట్‌కు స్వాగతం. హ్యాట్సాఫ్ టు లవ్ డాట్ కామ్ (Love.com).



## తంబిగారి ద్వారా జరిగిన మేలులు

నాకు గుండెలో నొప్పి బాగా వచ్చింది. ఆసుపత్రికి వెళ్లినా తగ్గడం లేదు. తంబిగారికి ప్రార్థించగా, తంబిగారు వచ్చి నన్ను తాకారు. గుండెనొప్పి తగ్గింది. నాకు గతంలో అనేకసార్లు రోగం వచ్చినప్పుడు తంబిగారి మధ్యస్థ ప్రార్థన ద్వారా నాకు మేలులు జరిగినవి.

***– సత్యవతి, జుజ్జూరు***

నాకు కుడిప్రక్కన మెదడులో చిన్న కురుపు. కరెంట్ షాక్ వచ్చినట్లయింది. 10 నిమిషాలు పాటు కళ్ళు కనిపించేది కాదు. అది బాగా ముదిరి 5 నిమిషాలు కొక్కసారి ఫిట్స్ వచ్చేవి. విజయవాడలో మనిషి బ్రతకడం కష్టం అన్నారు. యేసునామంతో ప్రార్థిస్తే తగ్గుతుందని పాస్టర్ ద్వారా చెప్పడం జరిగింది. మా అమ్మగారు గట్టిగా ప్రార్థించారు. స్వస్థత జరిగిన విశ్వాసం నాకు కలిగింది. తంబిగారి ప్రార్థన చేసే పాస్టర్ గారికి శిష్యునిగా పనిచేస్తున్నాను.

***– ఎన్.లాజరు, వేల్పూరు***

# అవుటపల్లి
# పునీత ఫ్రాన్సిస్సభా పవిత్రసభ్యుడు
# దైవసేవకుడు బ్రదర్ జోసఫ్ తంబి

*(గత సంచిక తరువాయి)*

## తంబిగారి బాల్యము

తంబిగారు తరచుగా పాండుచ్చేరికి వస్తూవుండేవారు గాని ఎవ్వరూ ఆయనను గుర్తించలేదు. 1928 సం॥లో ఒకానొక బంధువుని అంత్య క్రియలకు హాజరైనప్పుడు తన నాయనమ్మ అతనిని గుర్తుపట్టింది. ఫ్రాన్సిస్‌సభ తృతీయశ్రేణి తాలుకు కాఫీపొడిరంగు అంగీ ధరించే వాడు. 1932 సంవత్సరము అక్టోబరు పదునాల్గవ తారీఖున తన తమ్ముని కుమార్తె కార్మెల్ మఠ సభాప్రవేశ సాంగ్యమునకు వచ్చినపుడు కూడ అదే అంగీలో కనిపించాడు. తాను ఏ మఠమునకు చెందినవాడో ఎప్పుడు చెప్పలేదుకాని కేరళలోని 'కోయిలోను' మఠానికి తిరిగివెళ్ళాలని మాత్రం చెప్పేవాడు. ప్రతి శుక్రవారాలలో భావోద్రేకాలతో శ్రమలు అనుభవించేవాడు. బహుశ క్రీస్తు శ్రమలలో భాగస్వామ్యం పొందేవాడేమో. వివిధ రోగులకు వైద్యసేవలు చేస్తుండేవాడు.రోగుల కోరిక మీద ఒక విధమైన మంత్ర వైద్యం చేయుట కూడ కద్దు.

అద్భుత రీతిలో వియాత్నాంలోని 'సైగాను' వెళ్ళి తనవారిని కలిసినట్లు కూడ తెలియుచున్నది. 'సైగాను' నుండి తంబి తమతో వున్నాడని, పాండుచేరిలోని తమ కుటుంబీకులకు శుభాకాంక్షలు తెలియజేయుచున్నాడని వార్త పంపగా, ఇప్పటి వరకూ తమతోనే వున్న తంబి అంత దూరదేశం ఎలా చేరాడా అని ఆశ్చర్యపోయారు. ఆ రోజుల్లో విమాన ప్రయాణాలు సామాన్యులకు అందుబాటులో లేవుగదా! ఇది తంబి ద్వంద్వ దర్శన ప్రక్రియ అనుకొనవచ్చును. ఒకేవ్యక్తి ఒకే సమయంలో రెండుచోట్లా వుండటాన్ని ద్వంద్వ దర్శనం అంటారు. తంబిగారికి తెలుగు, తమిళము, మళయాళం, ఫ్రెంచి, ఆంగ్లభాషలలో పరిజ్ఞానం వుండేది. మన తిరుసభ అధికార లాటిను భాషలో కూడ ప్రార్థనలు వల్లించేవాడు.

రెండవ ప్రపంచయుద్ధకాలం 1942 సం॥లో బర్మాదేశమునుండి కొందరు పునీత అలోషియస్ గొంజాగ సిస్టర్లు నలుబది రోజులుగా పయనించి ఇండియారాగా, వారికి తెలియకుండా తంబిగారు వారిని వెంబడిస్తూ, వారిని పాండుచ్చేరి కథెడ్రల్ ప్రక్కనున్న మదర్ హౌస్‌కు చేర్చాడు. అప్పుడు వారు 'మీరు ఎవరు బాబూ' అని అడిగితే జవాబివ్వకుండా తప్పించుకుని తంబి వెళ్ళిపోయారు.



# దీనులుగు 'పావరెల్లో' అడుగు జాడల్లో

పునీత అసిసీపుర ఫ్రాన్సీసుగారు పాటించిన దారిద్ర్యతా సుగుణం వల్ల వీరిని 'పావరెల్లో' అని పిలుస్తారు. బ్రదర్ జోసఫ్ తంబిగారు వీరి నిజజీవితాన్ని ఆదర్శంగా తీసికొని ఆయనను పూర్తిగా అనుసరించడం ఒక సవాలుగా తీసికొని అదే వరవడిలో జీవించాడు. 'పునీత ఫ్రాన్సిస్‌గారి జీవిత చరిత్ర' అనే పుస్తకములోని ఈ క్రింది పాఠాన్ని చదివి దానినే మనసా వాచా కర్మ పాటించాడు.

"ఒకనాడు ఫ్రాన్సిస్‌గారు పునీత దామియన్‌వారి పేరవున్న పాడుబడిన దేవాలయంలో సిలువ స్వరూపముందు సాగిలపడి ప్రార్థన చేస్తుంటే ప్రభుదేవుని దివ్యహస్తం ఆయనమీదికి వ్రాలి ఈ లోకములోని సర్వసుఖాలు దేవుడిచ్చే జ్ఞాన ఫలాలముందు వట్టి తృణప్రాయంగా స్ఫురింప చేసాయి. 'ఇప్పుడు ఏమిచేయమంటారు ప్రభూ!' అంటూ ఫ్రాన్సిస్ ప్రార్థించగా సిలువపైనున్న ప్రభువు 'ఫ్రాన్సీసూ! నీవు వెళ్లి నా గృహాన్ని బాగుచేయుము.' అని స్వయంగా ఉపదేశించారు."

ఆనాడే ఫ్రాన్సీసు వారికి జ్ఞానోదయం కలిగింది. అప్పటి నుండి ఫ్రాన్సీసువారు పరిశుద్ధ సువిశేషపరంగా క్రీస్తుస్వామిని అనుసరిస్తూ మురిపించే ఇహలోక భోగభాగ్యాలకు దూరంగా వున్నాడు. తాను అనుసరించే ఈ మార్గంలోనికి అందరూ రావాలని ఆకాంక్షించేవారు. పంచగాయములు శ్రమలకు ప్రభుయేసుతో పూర్తిగా సమైక్యం కావాలనే తపనాఫలితం కాబోలు నేటికి కూడ పునీత ఫ్రాన్సీసుగారి ప్రభావం. జనంలోనికి చొచ్చుకు పోవడం లోని రహస్యం ఇదే కావచ్చు. ఆయనలోనే ప్రభుచూపిన సువార్త మార్గాన్ని తనివితీర చూస్తాము.

ఈ ప్రభావమే మన తంబిగారిని పూర్తిగా ఆవహించింది. దీని ఫలితంగా జోసఫ్ తంబిగారు 1930 సం॥లో పునీత ఫ్రాన్సీసు సభలో తృతీయ శ్రేణి సభ్యునిగా చేరి జీవితాంతము 'త్రైతేయుని'గా ఎదిగినారు. ఫ్రాన్సీసుసభలో మూడవ శ్రేణిలో వున్న సభ్యులను 'త్రైతేయులు' అంటారు. అందరూ తంబిగారిని ఫ్రాన్సిస్ సభా సభ్యునిగా భావించినా ఎప్పుడు ఎక్కడ ఆ మఠంలో చేరినాడో పూర్తిగా తెలియదు. జనం మాత్రం ఆయన వేషధారణ జీవనశైలిని బట్టి ఫ్రాన్సీసుసభ సన్యాసిగా భావించారు. పైన చెప్పినట్లుగా 1928లో తన బంధువు అంత్యక్రియలకు పాండిచేరిలో కూడ అవే దుస్తులతో హాజరుకాగా అతన్ని తన నాయనమ్మ గుర్తుపట్టింది కదా! దక్షిణ భారతంలో ఫ్రాన్సీసు కపూచియను సభ 1930లో మంగుళూరు ఫరంగిపేటలోని 'మౌంటు మెరియాని' ఆశ్రమములోను, తదుపరి 1932 సం॥లో కేరళలోని 'కొయిలోన్'లో 'సెయింట్ ఆంథోని ఫ్రయరి' స్థాపించబడింది. అంతకు పూర్వమే ఉత్తర భారతంలోని 'సర్ధాన' (ఉత్తరప్రదేశ్)లో స్థాపన జరిగింది. తరువాత ఈ స్థావరాన్నే మంగుళూరు కేంద్రానికి మార్చినారు. దీనిని బట్టి మన తంబిగారు తొలుత 'సర్ధాన' మఠములో చేరి తదుపరి కొయిలోన్ మఠంలో చేరి యుండవచ్చును.

*(సశేషం)*



# అసీసీపుర ఫ్రాన్సీసువారి జీవిత చరిత్ర

## మొదటి ముగ్గురు శిష్యులతో ఫ్రాన్సీసు దీన సన్యాసుల సభను స్థాపించుట : (క్రీ.శ. 1209-1210)

*(గత సంచిక తరువాయి)*

ఫ్రాన్సీసుగారి శిష్యులందరు ఆయనను దేవ వరప్రసాదియని యెంచి ఆయనకు విధేయులై ఆయన ఆజ్ఞలకై నిరీక్షించుచుండిరి. అంతట ఆయన వారిని ఇద్దరు ఇద్దరుగా మూడు దిక్కులనంపి తానొక శిష్యునితో నాల్గవ దిక్కునకు ఏసునాథునిగూర్చి ప్రజలకు తెలియజెప్పుటకు బయలుదేరెను. వారలతో ఆయన, "శిష్యులారా! మీ చింతలన్ని దేవునిపై యుంచి పరిపూర్ణ విశ్వాసముతో ప్రచారముచేయుడు. ఆయనయే మిమ్ములను పోషించును." అని చెప్పెను.

అట్లు నలువైపులకు బయలుదేరిన ఈ ఏసునాథుని వీరులు, దారిలో ఎదురుపడిన ప్రతివానితో, "దేవుడు మీకు సమాధానము నిచ్చుగాక!" అని యనుచుండెడువారు. ఏ దేవాలయము అగుపడినను, అందులో ప్రవేశించి, అందుగల స్లీవ స్వరూపము ముందు సాష్టాంగ ప్రణామంబుచేసి, ఫ్రాన్సీసు గారు నేర్పిన క్రింది ప్రార్థనను చేయుదురు. "ఓ ఏలినవారైన ఏసునాథా! ఇచ్చటను భూలోకము నందుగల సకల దేవాలయములలోను నిన్ను ఆరాధించుచున్నాము. నీ పవిత్రమైన స్లీవ చేత లోకమును రక్షించినందులకు, నిన్ను పొగడి స్తుతించుచున్నాము." ఎవరైన వారిని "మీరెవరు? మీది ఏ ఊరు? మీ పనియేమి?" అని అడిగిన, వారు "మేము అసీసీ పట్టణమునకు చెందిన పాపులము" అని అతి వినయముగ జవాబిచ్చెడువారు. సర్వేశ్వరుని మీది భక్తిని గూర్చియును, ఆయన ప్రసాదించు మోక్షరాజ్యమును గూర్చియు మాత్రమే ప్రసంగించెడువారు. ఇతర సంగతులను గూర్చి ముచ్చటించెడువారు గారు. ధర్మాత్ములు ఇచ్చు వెండి బంగారములనొల్లక, వారిచ్చు ఆహారమును మాత్రమే స్వీకరించెడువారు. తమను తిట్టి దూషించి శ్రమ పెట్టెడు వారిపై ఆగ్రహించక వారలకై దేవుని ప్రార్థింతురు.

ఇట్లు కొన్నాళ్ళు ప్రసంగించిన మీదట, ఫ్రాన్సీసుగారు అందరికన్న ముందుగ పోర్చియాంకులలోని దేవాలయమును చేరి, ముగ్గురు క్రొత్తశిష్యులను స్వీకరించిరి. ఒకనాడు ఆయన తన శిష్యులందరిని చూడతలచి వారందరిని తన యొద్దకు చేరమని దేవుని వేడుకొనిరి. దేవుడు యా కోర్కెను విని అందరినీ ఫ్రాన్సీసుగారి వద్దకు వచ్చునట్లు చేసిరోయన్నట్లు, పలు దిక్కులబోయి యుండిన శిష్యులందరు తమ గురువుగారి వద్దకు వచ్చి జేరిరి. వారలతో ఫ్రాన్సీసుగారు, "ప్రియమైన సోదరులారా! ఈ మీ చిన్న బృందము దేవుని ఆశీర్వాదములతో నానాటికి పెరిగి వర్థిల్లుట మీరే జూచెదరు. అటువంటి మన సభలో



మనమనుసరించవలసిన క్రమము నేర్పరచుకొని వానిని పరిశుద్ధ పోపుగారి పాదము వద్ద నుంచి, వారి అనుమతిని, ఆశీర్వాదమును పొందవలయును. ఏలననగా వారి అంగీకారము లేనిదే మనమే పారమార్ధిక పుణ్యకార్యమును చేయజాలము. కాబట్టి మనమందరము పోపుగారి వద్దకు పోయి, ఆయన సమక్షమున మనము ప్రచారము చేసి తెలిసికొన్న దేవుని మేలును ఎరిగించి, మన సభా నిర్వాహణమునకు ఆయన అంగీకరామును, ఆశీర్వాదమును పొందుదుము" అని చెప్పిరి.

తమ గురువుగారు చెప్పిన దానిలోని పరమార్థము గ్రహించినవారై, ఆ శిష్యులు ఫ్రాంసీసు గారితో సహకరించిరి. అప్పుడే ఫ్రాంసీసుగారు తమ దీవున సన్యాసుల సభా నియమములను వ్రాసిరి. అవి యేవనగా: దారిద్ర్యవ్రతము, విధేయత, విరక్తత్వము. వీనిని వివరముగా అందు దెలిపిరి. ఆ సభలోని సభ్యులు సమస్తమును త్యజించి, పూర్ణ దరిద్రులై, భిక్షమెత్తి జీవించుచు సువార్తా విశేషములను ప్రచారము చేయవలెను. పిదప ఆయన తమ శిష్యులతో పోపుగారి దర్శనార్థము రోమాపురికి ప్రయాణమైరి. వారి ప్రథమ శిష్యుడు బెర్నార్డు వారలకు త్రోవ జూపుచు ముందు పోవుచుండెను. ఏసునాదునితో అపోస్తులు జూదయ దేశమంత సంచరించిన చందమున ఈ గురువుగారు తమ శిష్యులతో పాదరక్షలు ధరించక పాదచారులై జపములతోను భక్తి సంభాషణలతోను రోమాపురియాత్రకు బయలుదేరిరి.

అట్లు వారు రియెత్తి అను పట్టణపు వీధుల గుండా నడచు చుండగా వారికొక యుద్ధవీరుడు ఎదురుపడెను. అతనిని అంతకు ముందు ఎన్నడు ఫ్రాంసీసుగారు చూచియుండలేదు. అయినను ఆయన అతనిని అతని పేరుతో పిలిచి "అంజెలో సోదరా! ఇన్ని రోజులు కవచములు ధరించి కత్తి కటారులు చేపట్టి యుంటివి. ఇక కవచమునకు మారుగ ముతక అంగీని ధరించి, కత్తికి మారు ఏసునాదుని స్లీవను మోసి, ఏసునాదుని వీరుడవుగమ్ము!" అని ఆదేశించెను. వెంటనే ఆ వీరుడు సకల సంఘ పరిత్యాగము చేసి ఆయనకు వదునొకండవ శిష్యుడయ్యెను.

రోమాపురిలో నేది యెట్లుండునో అని ఆందోళనపడుచు శిష్యులందరు తమ గురువుగారి ననుసరించు చుండిరి. అప్పుడు త్రోవలో ఒక తాటిచెట్టు కనబడెను. దాని యాకులు వంగి వారందరికి నమస్కారము చేసినట్లుండెను. అప్పుడు ఫ్రాంసీసు గారును వారి శిష్యులును దానిని గమనించి చాల ధైర్యము తెచ్చుకొని ప్రయాణము సాగించిరి.

*(సశేషం)*

**మీ స్పందన**

*పూజ్యులైన సంపాదక వర్గానికి స్తోత్రములతో టి. కనకరాజు వ్రాయునది మీ ఆధ్వర్యములో పత్రిక ఎన్నో ఆధ్యాత్మిక విషయాలు పాఠకులకు తెలియపరచింది. ఈ మూడు సంవత్సరాలు ఆధ్యాత్మిక రంగంలో ఎన్నో విషయాలు ఆలోచింప చేసే విధంగా ప్రచురించారు. బైబిల్‌పై మరింత అవగాహన కోసం క్విజ్ కార్యక్రమాలు పాఠకులకు ఆనందదాయకంగా ఉంది. అహోరాత్రులు శ్రమించిన మీకు మా హృదయపూర్వక కృతజ్ఞతలు. నూతనవర్గానికి హృదయ పూర్వక స్వాగతం. పాలక వర్గానికి ప్రత్యేకంగా ఎడిటర్ స్వామికి స్తోత్రములతో...*

***–టి. కనకరాజు, టి. సి హెచ్. పాలెం***



# పునీత అల్ఫోన్సమ్మ గారు

## దొంగను చూచి భయపడిన అల్ఫోన్స

*(గత సంచిక తరువాత)*

సిస్టర్ అల్ఫోన్స ఆరోగ్యంగా ఉన్నప్పుడల్లా తనకు సహాయపడే మఠవాసులను ఎక్కువగా తన వద్ద ఉండనిచ్చేదికాదు. ఎవరి పనుల్లోవారు నిమగ్నమై సామూహిక జీవిత బాధ్యతలు నిర్వహించాలనేదే ఆమె కోరిక. ఒక సాయంకాల సమయంలో తనకు వైద్య సహాయం చేయడానికి వచ్చిన మఠకన్యను ఇతర మఠవాసినులతో కలిసి ప్రార్థన చేయడానికి గుడికి పంపించింది. తరువాత, తాను ఒక సిలువ స్వరూపం తీసుకొని దానిపై ధ్యానించడానికి ఉపక్రమించింది.

ఇంతలో ఎవరో తన మంచం వద్ద నిలబడి గట్టిగా ఊపిరి పీలుస్తున్నట్టు అనిపించింది. అది యేమిటో అని చూడబోయే సరికి ఆమె మంచం ప్రక్కనే ఒక పురుషుడు ఉండడం గమనించింది. అతడు వికృతంగా ఉన్నాడు. అతనిని చూచి అల్ఫోన్స భయంతో కంపించిపోయింది. వెంటనే ఆమె సిలువను పైకెత్తి పట్టి ఆమెకు ఎలాంటి హాని చేయవద్దని అర్థించింది. ఆమె బలహీనురాలు అయినను మంచము మీద నుండి దిగి మెల్లగా భయపడుతూ వరండాలోనికి వచ్చింది. అప్పుడు వరండాలో నడుస్తున్న మఠకన్యలు ఈమెను చూశారు. వారు ఆమెకు వెంటనే సాయం చేసారు. అయితే అల్ఫోన్స భయంతో వణికిపోతూ మాట్లాడలేకపోయింది. ఆమె గదికి వారు తనను తీసుకొని పోతూ ఏమి జరిగిందని అడిగినా జరిగిన విషయాన్ని చెప్పలేకపోయింది. అయితే తనను అతిథి గృహానికి తీసుకువెళ్ళమని సైగ చేసింది. దొంగను గురించి ఏదో చెప్పింది గాని వాళ్ళకు అర్థం కాలేదు. ఆమె భయంలో ఏదేదో అయోమయంగా మాట్లాడుతుందని అనుకున్నారు. కాని వాళ్ళు ఆమెను గదికి చేర్చిన తరువాత దొంగవాడు "దొరికపోయాను కదా బాబో!" అంటూ కంగారుగా పారిపోతూ అక్కడ దొంగిలించిన వస్తువులను వదిలిపెట్టి వెళ్ళుటను వారు చూసారు. అప్పుడు వారికి జరిగిన విషయం అర్థమైంది.

బలహీనంగా మంచాన పడియున్న అల్ఫోన్సాను ఈ భయంకరమైన దృశ్యం మరింత దెబ్బతీసింది. ఆమె మతి కూడా చలించింది. ఆమెకు ఎప్పుడూ దగ్గర్లో ఉండి సేవచేసిన వాళ్ళను గుర్తించగలిగేది కాని, క్రొత్తవాళ్లు వస్తే భయపడిపోయేది. జ్ఞాపకశక్తి నశించేది. ఏమి తినలేక పోయేది. నిద్ర కూడా పట్టడం లేదు. నిద్రలో కూడా విశ్రాంతి పొందలేక పోయేది. ఆమె ఒక పసి పిల్లలాగా కలవరపడుతూ ఉండేది.

ప్రాపంచిక విషయాల మీద ఆశలు లేని అల్ఫోన్సాను ఎప్పుడూ కూడా దేవుని విషయాలే మాట్లాడుతూ ఉండేది. మధ్యమధ్యలో స్పృహను కోల్పోతూ ఉండేది. మగతతో నిద్రపోతూ ఉండేది. కొన్నిసార్లు ఇతరుల కోసం ప్రార్థన చేసినట్లు గాను, దేవునితో మాట్లాడుతున్నట్లుగాను కనిపించేది.

“ప్రేమామయుడైన ప్రభువా! నీ కోసం సమస్తము త్యజించిన వారికి తగిన ప్రతిఫలాన్ని ఇస్తానని నీవే మాట ఇచ్చావు గదా! నేను అన్ని విషయాలలో నా చిత్తాన్ని వదులుకొన్నాను గదా! నీ చిత్తానికే కట్టుబడియున్నాను గదా! నా వేడుకోలును ఆలకింపవా! నీ ప్రేమ నిమిత్తం శ్రమించే వారిని తగిన విధంగా బహూకరించడం నీ స్వభావం కాదా? అందుచేత నీవు నాకు అభయాన్ని ఇచ్చే వరకు నేనిక్కడ నుంచి వెళ్ళను. నేను తప్పుగా మాట్లాడుతున్నానా? నా విషయాలన్నీ నీవు పట్టించుకున్నట్లయితే నీ విషయాన్ని తప్పనిసరిగా నేను పట్టించుకుంటాను. నేను నీ వాగ్దానాన్ని నమ్ముకొని ఈ విషయాలన్నింటిలోను శ్రద్ధ చూపిస్తున్నానని, నీ మహిమను, నీ చిత్తాన్ని నేను పట్టించుకొని జీవించానని నీకు తెలుసు. నీవు నానుంచి కోరిందేదీ నేను నిరాకరించలేదు. కాబట్టి నేను అడిగింది నాకు ఇవ్వగలవు. నీ పేరుమీదుగానే గదా నేను ఉపవాసం ఉన్నాను. ఆకలైనా సరే ఆకలి లేనట్టు నటించాను, నీ పేరుమీదుగానే గదా నన్ను వేధించేవాళ్లను కూడా ప్రేమించాను.” ఇలా తనలో తాను మాట్లాడుకొంటూ ఇతరుల మేలెంచి ప్రార్థిస్తూ ఉండేది. మరలా.... “ప్రభువా! అజ్ఞానం వల్ల నాకు హానిచేయ ప్రయత్నించిన వారిని క్షమించండి” అని ప్రార్థించేది.

ఆమెకు ప్రీతికరమైన ప్రార్థనలో ఇదీ ఒకటి: “నీతి సూర్యుడవైన ఓ యేసువా! నీ కాంతికిరణాలను నా మీద సోకనివ్వండి. నా తలంపులకు స్పష్టతను దయచేయండి. నీ ప్రేమతో నన్ను అనుగ్రహించండి. నన్ను నీతో ఒకటిగా చేయండి! నీతో ఒకటైపోనియ్యండి!” ఇట్లు చెప్పుతూ సిలువ స్వరూపం పట్టుకొని తన హృదయానికి హత్తుకొనేది.

*(సశేషం)*

# యవ్వనస్తులారా! మేల్కొనండు..!

– బాపట్ల పందుబాబు

"అచట లోకజ్ఞానములేని యువకులనేకులు కన్పించిరి. వారిలో ఒకనికి బుద్ధి యిసుమంతయును లేదు" (సామెత 7:7).

"యవ్వనస్థుడా, జ్ఞానము లేనివారి మధ్య నిలువకుము."



యౌవనస్థులు చాలా ఉద్రేకపరులు మరియు యవనకాలములో మోసగించబడుటకు అవకాశాలు మెండు. వారికి శారీరక బలము ఎక్కువగా ఉంటుంది గానీ మనోబలము తక్కువ. అందువల్ల చాలా తేలికగా శోధనలలో లేక పాపములో పడిపోతారు. నేటి కాలములో చాలామంది యువకులు త్రాగుడు, జూదము, వ్యభిచారము, మాదక ద్రవ్యములు సేవించుట మొదలగు దురలవాట్లకు బానిసలై పోవుచున్నారు. యౌవ్వన కాలములో వారు నేర్చుకొన్న దురలవాట్లు వారి జీవితకాలమంతా వారిని వెంటాడుతుంది. మరియు వారి జీవితాలు దుర్భలరముగా తయారు అవుతాయి. దేవుడు మానవుని తన పోలికగా సృజించాడు. గాని పాపము అతనిలో మృగ వాంఛలు కలిగించి, అతనినొక మృగము స్థాయికి దిగజార్చుతుంది. వీటన్నిటిని తప్పించుకొనుటకు గాను యౌవ్వనస్థులకు దేవుని వాక్యము ఎంతో అవసరము. దేవుని వాక్యము మన నడతను పరిశుద్ధ పరుస్తుంది మనకు మనోబలము కలిగిస్తుంది. మనలను జ్ఞానులుగా చేస్తుంది. మంచి చెడుల విచక్షణను కలిగిస్తుంది. యౌవ్వనస్థులకు, ప్రార్థనా జీవితము, దేవుని వాక్య పఠనము ఎంతో అవసరము.

అయితే దేవుడు ఇచ్చుచున్నది జ్ఞానము. మానవుడు సంపాదించుకొనేది తెలివి. ఈ రెండింటి మధ్యా వ్యత్యాసము పూర్వం జరిగిన ఓ సంఘటన ద్వారా తెలుసుకుందాం,

18వ శతాబ్దంలో థాయిలాండ్ దేశంలో ఒక తల్లి, కొడుకు జీవిస్తున్నారు. కొడుకు ప్రతిరోజు అడవికి వెళ్ళి వారు తినడానికి జంతువులను వేటాడి తీసుకువచ్చేవాడు. ఈ విధంగా కుమారుడు తీసుకొచ్చిన మాంసంను తల్లి శుభ్రంగా రుచిగా వండిపెట్టేది. ఈ విధంగా వారి జీవితం కొనసాగుతుండగా, ఒకరోజంతా వెతికినా వేటాడడానికి జంతువులు దొరకలేదు అయితే ఈరోజు తినడానికి ఎలా అని ఆలోచిస్తూండగా చిన్నప్పుడు వాళ్ల నాన్నగారు ఇలాంటి పరిస్థితి ఎదురైనపుడు ఏవో రుచికరమైన ఆకులు తీసుకొని వచ్చారు. అవిగుర్తుకొచ్చి ఆ ఆకులు వున్న చెట్ల కోసం వెదకసాగాడు. కొద్దిసేపటికి ఆ ఆకుల గల చెట్టు కనబడింది.

వెంటనే తన దగ్గరవున్న రెండు పాత్రలు నిండకోసుకొని ఇంటి దారి పట్టాడు. తల్లికి జరిగిందంతా వివరించి ఆకులను ఇచ్చి కూరను త్వరగా సిద్ధం చేయి అని చెప్పి స్నానానికి వెళ్లాడు. కొంత సేపటికి ఆకలిగా వున్న ఆ యువకుడు తల్లి దగ్గరకు వచ్చాడు. తల్లి తన ఇంటి పనుల నిమిత్తం బయటకు వెళ్లింది. అప్పుడు సిద్ధం చేసిన కూర కనిపించింది వెంటనే కుమారుడుకి కోపం వచ్చింది. ఎందుకనగా రెండు పాత్రలు నిండ తెచ్చిన ఆకు ఒక పాత్రనిండ మాత్రమే కూర అయింది. తల్లి తనను మోసం చేసింది అనుకొని ఆవేశంలో వెంటనే వేట కత్తితో తన తల్లిని చంపాడు.

రెండు సంవత్సరాల తరువాత ఆ యువకుడుకి ఈలాంటి రోజు, అంటే వేటాడడానికి జంతువులు దొరకని సమయంలో మరల ఆ ఆకుని వెతుక్కుని కోసుకొని తానే ఇంటికి వెళ్లి వంట వండుకున్నాడు. రెండు పాత్రలు ఆకు ఉడుకించగానే ఒక పాత్రడు మాత్రమే అయింది. వెంటనే ఆ యువకుడు తన వేటకత్తితో పొడుచుకొని చచ్చిపోయాడు.

ఈ విధంగా యవ్వనస్థులకు ఆలోచన జ్ఞానం కేవలం దేవునిద్వారా మాత్రమే తెలుస్తుంది. కనుక యవ్వనకాలంలో దైవజ్ఞానం కోసం ప్రార్థనా, మరియు దైవభయంతో జీవించడానికి ప్రయత్నిద్దాం, ప్రయాస పడదాం.

**ప్రార్థన :**

"ప్రేమగల తండ్రీ! నా యౌవన కాలములో నాలో ప్రార్థనా జీవితము మరియు దైవ వాక్యపఠనము లేనందువలన చాలా శోధనల్లో పడిపోయాను. నా జీవితమును ఎంతో పాడుచేసు కున్నాను. నేటినుండి ప్రార్థనా జీవితము కలిగి యుండటానికి మరియు నీ వాక్యమును సమృద్ధిగా నా హృదయంలో నింపుకోడానికి నాకు సహాయము చేయుము." ఆమెన్.



## తంబిగారి ద్వారా జరిగిన మేలు

నా పేరు శివపురి అశోక్ కుమార్. మాది సివపురి గ్రామం, దుగ్గిరాల మండలం, గుంటూరు జిల్లా. నాకు పెళ్ళయినా 8 సం॥రాల వరకు పిల్లలు లేరు, అదే విధంగా నా చెల్లి అనూషకెళ్ళయి 9 సం॥రముల వరకు పిల్లలు లేరు. మా అమ్మ నాన్న బలవంతం వలన తంబిగారి సన్నిధిలో మూడు రోజులు నిద్రచేయగా ఇద్దరికీ అనగా నాకు, మా చెల్లికి ఒకేరోజు మగపిల్లలు పుట్టినారు.

కేవలం తంబిగారి మధ్యస్థ ప్రార్థన ద్వారా జరిగినది. తంబిగారికి స్తోత్రములు. యేసుప్రభువుకు స్తోత్రములు.

*– శివపురి అశోక్ కుమార్, గుంటూరు*

## సాక్ష్యము - ఏలూరు మేత్రాసనము దెందులూరు విచారణ

జనవరి నెలలో 13 నుండి 16 వరకు 2011 సం॥రంలో లక్షలాది ప్రజలు తంబి సమాధి దగ్గరకు వచ్చినారు. దెందులూరు ప్రక్కనవున్న ఒక గ్రామము నుండి 16-1-2011న కుమారి అనే ఆర్.సి.యం. క్రైస్తవురాలు ఎంతో దుఃఖముతో ఏడ్చుచు నా దగ్గరకు సమాధి వద్ద ప్రార్థన చేయమని వచ్చింది. ఆమె ఏడ్చుచు వచ్చి 4 ప్రశ్నలు వేసింది. అమ్మా! నా కుమారుడు రాజేష్ 12 సం॥లు ప్రాయములో 8వ తరగతి చదువకుండ ఇంటినుండి వెళ్ళిపోయాడు. ఇపుడు 7 సం॥లు యైనది. ఇపుడు ప్రాయం 19 సం॥ములు. నా కొడుకు ఎక్కడ వున్నాడు? బ్రతికి వున్నాడా? మరణించి నాడా? తిరిగి ఇంటికి వస్తాడా? యని కన్నీరు కార్చుచు ప్రాధేయపడింది. నాకు ఎంతో బాధ కలిగింది. జాలి వేసింది. కండ్లు మూసుకుని ఆమెతో చిన్న ప్రార్థన పలికించాను. దేవుడు నాకు చూపించిన దర్శనము ప్రకారం నీ కుమారుడు రాజేష్ బ్రతికి వున్నాడు. హైద్రాబాదు హోటల్లో పని చేస్తున్నాడు. జూన్ నెల 28వ తారీకునకు ఇంటికి వస్తాడని చెప్పినాను. ఆమె నాఫోనునెంబరు తీసుకొని వెళ్ళింది. 3 సార్లు ఫోనులో ప్రార్థన చేయించుకుంది. నేను కన్నీటితో, ఉపవాస ప్రార్థనలో యేసు ప్రభువును మరియతల్లిని విశ్వాసముతో ఆ బాబును ఇంటికి రప్పించమని ప్రార్థించాను. గొప్ప అద్భుతము అనుకోవాలి. జూన్ నెల 28వ తారీకున రాజేష్ ఇంటికి వచ్చాడు. కుమారి నాకు జూలై 10వ తారీకున సంతోషముతో ఆనందంతో ఫోనులో పలికింది. అమ్మా మీరు చెప్పినట్లు హైద్రాబాదులో పనిచేసుకోని తిరిగి వచ్చాడు. మీకు నేనెంతో రుణపడ్డాను. మీరు ఎక్కడికి వెళ్లిన అక్కడ నా సాక్ష్యము చెప్పమ్మా అని అడిగింది.

తంబిగారి మధ్యస్థ ప్రార్థనల వలన ఎంతో మంది సంతానం పొందారు. యువతీ యువకులకు ఉద్యోగాలు లభించి వివాహాలు జరిగినవి. కోర్టు కేసులు, భయంకరమైన ఘోరవ్యాధులు నుండి స్వస్థతను పొందారు. ప్రతి సం॥రము వారికి జరిగిన మేలులకు, అద్భుతాలకు మ్రొక్కులు చెల్లించి, కృతజ్ఞతలు చెల్లించ, తండోప తండాలుగా లక్షలాది భక్తులు వచ్చి, యేసుప్రభుల దీవెనలు పొంది ఆనందంతో తిరిగి వెళ్తున్నారు. తంబి బ్రదర్ గారే ఆ జనులందరిని పిలుచుకుంటున్నారు. కనుక నేను కూడ విశ్వాస ముతో, నమ్మకంతో ప్రజలకు ప్రార్థనలు చేయాలని ఆశతో వస్తున్నాను. అమ్మా మరియమాత, తంబిగారు ఈ 13 సం॥రాలు సువార్త సేవలో నాలో వుండి నడిపించుచు, యేసు ప్రభువు నా ఊపిరి, నా రక్షకుడుగా వుండి, పరిశుద్ధాత్మ అనుగ్రహాలతో, వరములతో నన్ను నింపి, అలుపు ఆయాసములేకుండ అనేకుల కొరకు ప్రార్థించే వరం దయ చేశారు. యేసు ప్రభువునకు వేలాది వందనాలు. మేరిమాతకు వేలాది స్తోత్రములు. ఆవే మరియ.. ఆవే మరియా... వర్ధిల్లుము. బ్రదర్ జోసఫ్ తంబిగారా! జపమాల మాతా! మాకై ప్రార్థనచేయండి. ఆమెన్.





# బైబులు పోటీలు- 8

**బైబులు వచనాలు తప్పనిసరిగా వ్రాయాలి.**

**ఈ క్రింది ప్రశ్నలు "మక్కబీయులు రెండవ గ్రంథము, పౌలు ఫిలిప్పీయులకు వ్రాసిన లేఖ" నుండులు తీసుకొనబడునవి.**

1. ఏ నెలలో గుడారముల పండుగ చేసుకొనిరి?
2. ఆయన ఎల్లప్పుడును దైవస్వభావమును కలిగి వున్ననూ దేవునితో తన సమానత్వమును స్వార్థ బుద్ధితో పట్టుకొని వ్రేలాడలేదు ఆయన ఎవరు?
3. సొలోమోను దేవాలయమును ప్రతిష్టించి ఎన్ని దినములు ఉత్సవము చేసెను?
4. తిమోతి పసిబిడ్డగా వున్నపుడు ఎన్నవ దినమున సున్నతి కావింపబడెను?
5. అంతియోకసు రాజు రోమీయులకు ఎంత వెండిని అప్పగించెను?
6. దేహవాంఛలే దైవముగా భావించువారికి ఎలాంటి నివాసము కలదు?
7. యూదా అతని అనుచరులు కాస్పిను నుండి ఎంతదూరము నడచి, ఎచటకు చేరిరి?
8. ఏక మనస్కులై ఉండవలెనని ఎవరెవరిని వేడు కొనుచున్నారు?
9. 149 వ యేట అనగా క్రీస్తు పూర్వము ఎన్నవ సంవత్సరము?
10. కేవలము స్వార్థమునే చూచుకొనక, పరస్ప రము ఎలా ఉండవలెను?

***సరియైన సమాధానములు - 7***

***(మక్కబీయులు మొదటి గ్రంథము, పౌలు ఎఫేసీయులకు వ్రాసిన మొదటి లేఖ నుండి)***

1. "పంద్రెండేడ్లు"
2. క్రమశిక్షణతోను, ప్రభువు బోధనలతోను
3. వేయిమంది
4. క్రీస్తునకు శ్రీసభాపై గల అధికారము వంటిది
5. మోదేను లోని తమ కుటుంబ సమాధిలోనే పాతిపెట్టిరి
6. "ఐదువేలమంది కాలిబంటులను, వేయిమంది నిపుణులైన రౌతులను"
7. ప్రభువు మంచివాడు అతని దయ కలకాలము నిలుచును
8. "జారత్వము, అపవిత్రత, లోభిత్వము"
9. నూట డెబ్బది నాల్గవ యేట
10. యూదా మక్కబీయుడు

***సరియైన సమాధానములు పంపిన వారి పేర్లు***

1. బి.యమ్.భాగ్యం
2. టి.కనకరాజు
3. ఎస్.ఫ్రాన్సీసమ్మ
4. జి. మేరిమ్మ
5. కె. విజయకుమారి
6. డా. ఉదయతార
7. ఎన్. సుజాత
8. ఎమ్.ఎ.ఎల్.జ్యోతి
9. కె. రోజానమ్మ

**లాటరీ ద్వారా విజేతలు**

1. కె. విజయకుమారి - కేసరపల్లి (మొదటి బహుమతి)
2. ఎమ్.అరుణలీలాజ్యోతి - పొట్టిపాడు (రెండవ బహుమతి)

*(విజేతలు ఫా.మాదాను చిన్నప్ప గారు సహాయ విచారణ గురువులు, పెద్దావుటపల్లి వారిని సంప్రదించి పారితోషికం పొందగలరు.)*

**గమనిక :** బైబులు పోటీలలో పాల్గొనువారు తమ జవాబులను పోస్టుద్వారా మాత్రమే పంపగలరు. బైబులు పోటీలలో లాటరీ ద్వారా విజేతలకు పారితోషకం ఇవ్వబడుతుంది.

**విజేతలకు మొదటి బహుమతి రూ. 50/- రెండవ బహుమతి రూ. 40/-**

**జవాబులు పంపవలసిన చిరునామా :**

సంపాదకులు, జోసఫ్ తంబి ఆశ్రమం, పెద్దావుటపల్లి - 521 286, కృష్ణాజిల్లా.

*తప్పుచేయడం నరుని వంతు. క్షమించడం దేవుని వంతు.*




# తంబివెలుగు

సంపాదకులు :
**రెవ.ఫా. దేవదాసు దుగుట** O.F.M. cap.,
e mail : duguta@yahoo.co.in
Cell : 9491384383

సహసంపాదకులు:
రెవ.ఫా. బూరుగు జయప్రసాద్ O.F.M. cap.,
Cell : 9492140327

సర్క్యులేషన్ & మేనేజింగ్ఎడిటర్ :
రెవ.ఫా. జ్వాన్నేసు సీయూరి O.F.M. cap.,
Cell : 9492975881

కార్యవర్గ సభ్యులు :
రెవ.ఫా. చెరియన్ చెంప్లానీ O.F.M. cap.,
రెవ.ఫా. చిన్నప్ప మాదాను O.F.M. cap.,
కాటికిస్ట్ సిస్టర్లు ఆఫ్ సెయింట్ ఆన్లు, పెద్దావుటపల్లి
యఫ్.సి.సి. సిస్టర్లు, పెద్దావుటపల్లి
శ్రీ వి. జోస్ పీటర్, పెద్దావుటపల్లి
శ్రీ డా. రఘుబాబు, పొట్టిపాడు

సలహా కమిటీ :
రెవ.ఫా. ప్రవీణ్ బోయపాటిO.F.M. cap., (ప్రావిన్షియల్)
రెవ.బ్రదర్. ఆరుగొలను సమూయేలు O.F.M. cap.,
శ్రీ నున్న అంజారావు
కపూచిన్ బ్రదర్లు, జానంపేట


## చందా వివరాలు

| | | |
|---|---|---|
| సాలు చందా | రు. | 70/-లు |
| 3 సం॥లు చందా | రు. | 200/-లు |
| 5 సం॥లు చందా | రు. | 350/-లు |
| జీవిత చందా | రు. | 2000/- |

## ప్రకటన రేట్లు

| | | |
|---|---|---|
| వెనుక కవరు కలర్ | రు. | 1400/-లు |
| వెనుక కవరు లోపల | రు. | 1000/-లు |
| పూర్తిపేజి (B/W) | రు. | 500/-లు |
| 1/2 పేజి (B/W) | రు. | 400/-లు |
| 1/4 పేజి (B/W) | రు. | 300/-లు |

## లోపలి పేజీల్లో....


| | |
|---|---|
| 1. సంపాదకీయం | 1 |
| 2. జపమాల అద్భుత శక్తి | 3 |
| 3. క్రీస్తులోనే నా రక్షణ | 6 |
| 4. సహనం | 9 |
| 5. దేవుడు మనతో ఉన్నచో... | 11 |
| 6. దృఢమైన విశ్వాసం | 13 |
| 7. లివ్ డాట్ కమ్ | 14 |
| 8. బ్రదర్ జోసఫ్ తంబి | 16 |
| 9. అసీసీపుర ఫ్రాన్సీసువారి జీవిత చరిత్ర | 18 |
| 10. పునీత అల్ఫోన్సా గారు | 20 |
| 11. యవ్వనస్తులారా! మేల్కొనండు | 22 |
| 12. సౌక్యము | 24 |
| 13. బైబులు పోటీలు - 8 | 25 |


**బ్రదర్ జోసఫ్ తంబి గారి మూలన జరిగిన మేలులు, ఆధ్యాత్మిక రచనలు, మరియు మీ వ్యాపార ప్రకటనల కొరకు మీరు ఈ క్రింది చిరునామాకు వ్రాయండు.**


మా చిరునామా :
సంపాదకులు,
**తంబి వెలుగు**
జోసఫ్తంబి ఆశ్రమం, పెదావుటపల్లి -521 286
కృష్ణాజిల్లా, ఆంధ్రప్రదేశ్. ఫోను : 08676-259422,

సంపాదకుల చిరునామా :
సంపాదకులు, **తంబి వెలుగు**
ఫా. దేవదాసు, సెయింట్ ఫ్రాన్సిస్ కాలేజి, జానంపేట,
విజయరాయి (పోస్టు), ప.గోదావరి జిల్లా - 534475


**For Private Circulation only**